

పెన్ పవర్

తెలంగాణ రౌండప్

కూల్చకుండానే...

'కూల్చివేశాం' అంటూ నివేదిక..!

- "సిఎంసి మై-క్యూర్ సిటిజన్ యాప్"ను నీరుగారుస్తున్న టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ..
- పట్టాభూమి సర్వే నెంబర్‌లతో అనుమతులు..! ప్రభుత్వ భూమిలో బహుళ అంతస్తుల నిర్మాణం..

- "మై-క్యూర్ సిటిజన్ యాప్" ఫిర్యాదుల ముగింపులో అధికారుల మాయాజాలం..?
- సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారుల బరితెగింపు విధులతో ఈ అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోకుండా సహకారం..!
- 283 గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమణపై కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ..
- నిర్మాణ అనుమతులు మంజూరైన రిజిస్ట్రేషన్ పత్రాల్లో సర్వే నంబర్లకు..నిర్మాణం చేపట్టిన స్థలానికి పొంతనేది..?
- అక్రమ నిర్మాణాలు ఉంటే నిలిపివేయాలని, ఓవైపు ఫిర్యాదు దారుడి పిటిషన్‌పై హైకోర్టు ఆదేశాలు..!
- మరోవైపు నిర్మాణదారురాలు పిటిషన్‌లో యథాతథ స్థితి కొనసాగించాలని మరో ఉత్తర్వు..!
- రెండు ఫిర్యాదులకూ ఒకే సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారి అయినప్పటికీ..! తూతూ మంత్రపు చర్యలతో..!
- భవనం కూల్చివేసినట్లు ఒకే సమాధానంతో "సిఎంసి మై-క్యూర్ సిటిజన్ యాప్" ముగింపుపై అనుమానాలు..
- నిర్మాణాలపై పర్యవేక్షణ లేకుండా బాధ్యతా రాహిత్యంతో వ్యవహరించిన గాజులరామారం సర్కిల్..
- బాధ్యులైన అధికారులపై విజిలెన్స్ విచారణకు డిమాండ్ చేసిన ఫిర్యాదు దారుడు..

- గాజులరామారంలో 283 గజాల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం వివాదం..
- సర్వే నెంబర్ 329 ప్రభుత్వ భూమిలో నిర్మాణంపై ఫిర్యాదు దారుడి అభ్యంతరం..
- కొనుగోలు చేసిన భూ దస్తావేజుల సర్వే నంబర్లతో భవన నిర్మాణ అనుమతులు..!
- అనుమతి పత్రాల్లో లేని సర్వే నెంబర్ 329 ప్రభుత్వ భూమిలో దర్జాగా అక్రమ నిర్మాణం..
- మామూళ్ళ మత్తులో పర్యవేక్షణ విస్మరించి అక్రమార్కులతో కుమ్మక్కుపై విమర్శలు..
- రెవెన్యూ అధికారులు నోటీసులిచ్చినా చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు..
- అక్రమ నిర్మాణాలుంటే నిలిపివేయాలంటూ హైకోర్టు మధ్యంతర ఆదేశం..
- నిర్మాణ దారుల మరో పిటిషన్‌లో, సదరు నిర్మాణంపై యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశం..
- ఈ రెండు ఫిర్యాదులనూ ఒకే సమాధానంతో, సిఎంసి మై-క్యూర్ సిటిజన్ యాప్" ముగించిన టౌన్‌ప్లానింగ్ అధికారి..!
- భవనం కూల్చివేశామని నివేదిక.. కానీ కూల్చివేత ఆధారాలు ఏవంటూ ప్రశ్నిస్తున్న ఫిర్యాదుదారుడు..
- రెండు వైపులా కోర్టు పరిధిలో ఉండగానే..! "సిఎంసి మై-క్యూర్ సిటిజన్ యాప్" కోస్ చేసిన టిపిఎస్..!



గాజులరామారం ప్రభుత్వ భూమిలో కూల్చివేశామని చెప్పిన భవనం ఇదే..

-4లో

గ్లోబల్ సమిట్‌లో టూరిస్ట్ స్పాట్లను

ప్రదర్శించాలి



- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్
- సమిట్‌కు హాజరయ్యే ప్రతినిధులకు లైజనింగ్ ఆఫీసర్ల నియామకానికి సీఎం ఆదేశాలు
- ప్రతినిధుల రిజిస్ట్రేషన్, పాస్‌ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సూచన
- తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సమిట్‌లో ప్రదర్శించాలని దిశానిర్దేశం
- వాతావరణ మార్పులు, విద్యారంగంపై ప్రత్యేక చర్చలు నిర్వహించాలని సూచన
- నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు తెలంగాణ విద్యావ్యవస్థ ప్రతిబింబించేలా ఏర్పాట్లు
- నవంబర్ 15లోగా సమిట్ ఏర్పాట్ల ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశం
- ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా సదస్సుకు ఆహ్వానించాలని సూచన

హైదరాబాద్ పెన్ పవర్: ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్‌లో పాల్గొనే ప్రతినిధులకు లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతినిధుల రిజిస్ట్రేషన్, పాస్‌ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ప్రముఖ టూరిస్ట్ స్పాట్లను సమిట్‌లో ప్రదర్శించాలన్నారు. వాతావరణ మార్పులపై సదస్సులో చర్చ జరిగేలా చూడాలని, నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ వరకు - మిగతా 5లో...

అయ్యప్ప సొసైటీపై సర్వే చేయాలి

రేవంత్ సర్కారుకు కవిత నెల రోజుల డెడ్‌లైన్

- అయ్యప్ప సొసైటీ అక్రమ కట్టడాలపై సర్వేకు కవిత డిమాండ్
- కాంగ్రెస్ వచ్చాక 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆరోపణ
- సీఎం సోదరులే డబ్బులు దండుకుంటున్నారని వ్యాఖ్య

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లోని ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని, లేదంటే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు 'రెడ్ మార్క్' వేస్తారని హెచ్చరించారు. హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో సుమారు 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులే దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప సీఎం రేవంత్‌కు మరేమీ కనిపించడం లేదని ఆమె విమర్శించారు. ఈ వ్యవహారంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు జరగవని, అక్కడ ఇళ్లు కొనుగోలు చేసి ప్రజలు నష్టపోవద్దని కవిత సూచించారు. గురుకుల ట్రస్ట్ భూములపై గతంలో తాము ఎన్నో ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. ఇదే సొసైటీలో నారాయణ, చైతన్య వంటి విద్యాసంస్థలు కూడా ఉన్నాయని ఆమె తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపైనా



కవిత స్పందిస్తూ, ఆయన కేవలం రాజకీయాలు మాట్లాడి వెళ్లారని, రాష్ట్రంలోని కరవు పరిస్థితులపై స్పందించలేదని విమర్శించారు.

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 5: ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరుగుతోందని ఫిర్యాదు.. నిర్మాణానికి అనుమతులు ఎలా వచ్చాయన్న సందేహాలు.. రెవెన్యూ శాఖ నుంచి ఆక్రమణ నోటీసులు.. అక్రమ నిర్మాణాలు ఉంటే నిలిపివేయాలని హైకోర్టు ఆదేశాలు.. మరోవైపు నిర్మాణదారురాలి పిటిషన్‌లో యథాతథ స్థితి కొనసాగించాలని న్యాయస్థానం ఉత్తర్వులు.. ఇన్ని పరిణామాల మధ్య మున్సిపల్ ప్రజా ఫిర్యాదుల పోర్టల్‌లో (సిఎంసి మై-క్యూర్ సిటిజన్ యాప్) మాత్రం భవనం ఇప్పటికే కూల్చివేసినట్లు నివేదిక..! గాజులరామారం సర్వే నెంబర్ 329 ప్రభుత్వ భూమిలోని 283 చదరపు గజాల స్థలానికి సంబంధించిన ఈ వ్యవహారం ఇప్పుడు అధికారుల పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.. భవనం నిజంగానే కూల్చివేశారా..? కూల్చివేస్తే అందుకు సంబంధించిన ఆధారాలు ఎక్కడ..? కూల్చివేత జరగకపోతే రెండు ఫిర్యాదులనూ ఒకే సమాధానంతో ఎలా ముగించారు..? అన్న ప్రశ్నలతో ఫిర్యాదుదారుడు వి.మధుబాబు మరోసారి ఉన్నతాధికారులను ఆశ్రయించారు.. అసలు భూ వివాదం రెండు వైపులా హైకోర్టు పరిధిలోనే ఉంది.. సమస్య పరిష్కారం కాలేదు.. మరోవైపు ప్రభుత్వ భూమి ఆక్రమించారని రెవెన్యూ అధికారుల సర్వేతో నోటీసులు కూడా జారీ చేశారు.. ఇదంతా తెలిసిన సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారిని "సిఎంసి మై-క్యూర్ సిటిజన్ యాప్"లో ఫిర్యాదులపై చర్యలు చేపట్టినట్టు కంప్లైంట్ క్లోజ్ చేయడం కొత్త వివాదానికి దారితీసింది..



రెండు హైకోర్టు ఆర్డర్‌లపై ఊహాజనిత ఏఐ చిత్రం.

కూల్చకుండానే.. 'కూల్చివేశాం' అంటూ నివేదిక..!

అనుమతులు ఒకచోట..! నిర్మాణం మరోచోట..!

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం పరిధిలోని సర్వే నెంబర్ 329 ప్రభుత్వ భూమిలో సుమారు 283 చదరపు గజాల్లో నిర్మాణం జరుగుతోందని ఫిర్యాదు దారు ఆరోపిస్తున్నారు..! రావుల ఉదయశ్రీ (భర్త రావుల శేషగిరి), రామకృష్ణ బోనగిరికి సంబంధించిన ఈ నిర్మాణంపై ఆయన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.. ఈ వివాదంలో ప్రధానంగా తెరపైకి వచ్చిన అంశం రిజిస్ట్రేషన్ పత్రాల్లోని సర్వే నంబర్లు. ఫిర్యాదుదారుడు పేర్కొన్న వివరాల ప్రకారం, నిర్మాణ అనుమతులకు ఆధారంగా చూపినట్లు చెబుతున్న దస్తావేజు నెంబర్: 28808/2019లో, సర్వే నెంబర్‌లు: 309, 310, 311, 312, 313, 316 ఉన్నాయి.. కానీ వివాదాస్పద నిర్మాణం మాత్రం సర్వే నెంబర్ 329 ప్రభుత్వ భూమిలో ఉందన్నది ఫిర్యాదు దారుని ఆరోపణ.. అసలు ఈ రెండు సర్వే నెంబర్లకు పొంతనేది..? రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ప్రకారం అనుమతులు తీసుకున్న భూమి ఒకచోట ఉండగా, నిర్మాణం జరుగుతున్న స్థలం మరోచోట ఉందని, రెండింటికి సంబంధం లేదని రెవెన్యూ అధికారులే తేల్చారు..! యాజమాన్య పత్రాలు, రెవెన్యూ రికార్డుల పరిశీలనలో తేటతెల్లం అయింది..

ఈ నిర్మాణానికి సంబంధించి డాక్యుమెంట్ నెంబర్ 038471/GHMC/11064/IABP/C57/2026 కింద 30-01-2026న భవన నిర్మాణ అనుమతి ఉత్తర్వు జారీ అయినట్లు ఫిర్యాదుదారుడు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు..

ఫిర్యాదు దారుడి పిటిషన్‌పై హైకోర్టు ఆదేశాలు..

అధికారుల తీరుపై పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా ఫిర్యాదు దారుడు హైకోర్టును ఆశ్రయించారు. డబ్ల్యూపీ నెంబరు 33068/2026లో ఈ పిటిషన్‌పై 01-10-2026న హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది.. వివాదాస్పద స్థలంలో ప్రతివాదులు 12, 13 అనధికార నిర్మాణాలు చేపడుతున్నట్లయితే వాటిని వెంటనే నిలిపివేయాలని ప్రతివాది నెంబరు 8 గాజులరామారం డిప్యూటీ కమిషనర్‌ను న్యాయస్థానం ఆదేశించింది.. అంటే నిర్మాణాలు అక్రమంగా కొనసాగుతున్నాయా లేదా అన్నది పరిశీలించి, అక్రమ నిర్మాణాలు ఉంటే వాటిని నిలిపివేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారిపై ఉందని కోర్టు గుర్తు చేసింది.. అయితే ఈ ఉత్తర్వులు భవనాన్ని కూల్చివేయాలని, నిర్మాణ అనుమతిని రద్దు చేయాలని ఇచ్చిన ఆదేశం కాదని. అక్రమ నిర్మాణాలు ఉంటే నిలిపివేయాలన్నదే మధ్యంతర ఆదేశంగా పేర్కొన్నారు..

ప్రభుత్వ భూమిగా రెవెన్యూ నోటీసులు..!

వివాదాస్పద స్థలంపై రెవెన్యూ అధికారులు కూడా చర్యలు చేపట్టినట్లు న్యాయస్థానానికి సమర్పించిన వివరాల్లో ఉంది..కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం నుంచి 29-07-2026న భూ ఆక్రమణ నిరోధక చట్టం ప్రకారం సెక్షన్ 7 కింద నోటీసు జారీ చేసినట్లు పేర్కొన్నారు.. అనంతరం 18-09-2026న అదే డాక్యుమెంట్ నెంబరుతో సెక్షన్ 6 కింద మరో నోటీసు జారీ చేసినట్లు వివరించారు. ఈ రెండు నోటీసులు తహసీల్దార్ కార్యాలయం నుండి ఫైల్.నెంబర్: బి/678/2026కు సంబంధించినవి.. ప్రభుత్వ భూమి ఆక్రమణపై రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, అదే స్థలంలో నిర్మాణ అనుమతుల వ్యవహారంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.. రెవెన్యూ నోటీసులు జారీ చేసినప్పటికీ, గాజులరామారం సర్కిల్ మున్సిపల్ అధికారులు తమదైన శైలిలో చర్యలు చేపట్టారా..? అనుమతుల మంజూరు మొదలుకొని, నోటీసులు-సీజింగ్‌లు, అప్పుడప్పుడు పాక్షిక కూల్చివేతలు, ఇదంతా చట్టప్రకారమే అయినప్పటికీ.. అధికారుల మొక్కుబడి చర్యలతో అక్రమ నిర్మాణంలో ఎలాంటి మార్పులు ఉండవు అనేది నగ్న సత్యం.. సిఎంసి కార్యాలయాలు కేవలం అధికారుల కరప్షన్ కోసమేనని, వివిధ సర్కిళ్ళలో నిరూపిస్తున్నారు..


ఇదే వివాదానికి సంబంధించి రావుల ఉదయశ్రీ కూడా హైకోర్టును ఆశ్రయించారు. డబ్ల్యూపీ నెంబరు 34091/2026గా నమోదైన ఈ పిటిషన్‌ను జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ 09-10-2026న విచారించారు.

నిర్మాణ దారురాలి పిటిషన్‌పై యథాస్థితికి ఉత్తర్వులు..

మహదేవపురం నివాస ప్రాజెక్టు మూడో దశలోని జె-99 స్థలం 283 చదరపు గజాల విస్తీర్ణంలో ఉందని, అది 309, 310, 311, 312, 313, 316 సర్వే నెంబర్ల పరిధిలో ఉందని పిటిషనర్ పేర్కొన్నారు.. అయితే ఈ స్థలాన్ని సర్వే నంబర్ 329 లోని ప్రభుత్వ భూమిగా పరిగణిస్తూ రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారని సవాలు చేశారు.. ఆ నోటీసులను రద్దు చేయాలని, తనకు సంబంధించిన స్థలంపై బలవంతపు చర్యలకు పాల్పడుతున్నట్టు నిర్మాణ దారులు పేర్కొన్నారు.. కూల్చివేతలు చేపట్టకుండా రక్షణ కల్పించాలని కోరారు.. ఈ పిటిషన్‌పై హైకోర్టు తదుపరి విచారణ వరకు పిటిషనర్‌కు సంబంధించిన స్థలంలో అప్పటి పరిస్థితిని యథాస్థితిని కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది..

రెండు ఫిర్యాదులకూ ఒకటే సమాధానం.. 'భవనం' కూల్చివేశాం..!

ఈ వ్యవహారంలో సిఎంసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం మరో వివాదానికి కారణమైంది..ఫిర్యాదు దారుని మొదటి కంప్లైంట్‌ను 21-09-2026న 2109266155893 నెంబరుతో, రెండో ఫిర్యాదును 12-10-2026న 1210266200523 నెంబరుతో నమోదు చేశారు.. ఈ రెండు ఫిర్యాదులూ పట్టణ ప్రణాళిక విభాగం సెక్షన్ ఆఫీసర్ బి. సరితా సేన్‌కు కేటాయించినట్లు పోర్టల్ వివరాల్లో కనిపిస్తోంది.. అయితే రెండు ఫిర్యాదులకూ ఒకటే సమాధానం నమోదు చేసి 24-10-2026న, సమస్య పరిష్కారం అయిందని, "సిఎంసి మై-క్యూర్ సిటిజన్ యాప్"ను ముగించినట్లు ఫిర్యాదు దారుడు, మరో కొత్త కంప్లైంట్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.. సంబంధిత యాప్‌లో పేర్కొన్న సారాంశం ఇలా ఉన్నది.. 'స్థలాన్ని పరిశీలించగా భవనం ఇప్పటికే కూల్చివేసినట్లు గుర్తించామని'.. రెండు వేర్వేరు తేదీల్లో నమోదైన ఫిర్యాదులకు ఒకే సమాధానం ఎలా ఇచ్చారు..? రెండు సందర్భాల్లోనూ క్షేత్రస్థాయి పరిశీలన జరిగిందా..? జరిగితే పరిశీలన తేదీలు ఏమిటి..? భవనం ఏ తేదీన కూల్చివేశారు..? ఎవరి ఆదేశాల మేరకు కూల్చివేతలు జరిపారు..? దానికి సంబంధించిన, ఫొటోలు, వీడియోలు, తనిఖీ నివేదికలు ఏవి..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. అసలు భవనం కూల్చివేయలేదని ఫిర్యాదు దారుడు మధుబాబు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై విజిలెన్స్ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలనతో నిర్ధారించాలని డిమాండ్ చేశారు..



టిపిఎస్‌పై విజిలెన్స్ విచారణకు డిమాండ్.. కమిషనర్‌కు ఫిర్యాదు..

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయకుండానే రెండు ఫిర్యాదులను ఒకే సమాధానంతో సిఎంసి మై-క్యూర్ యాప్ క్లోజ్ చేసిన, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ సూపర్‌వైజర్‌పై విచారణ కోరుతూ ఫిర్యాదు దారుడు, గురువారం (నవంబర్ 5న) సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్, గాజులరామారం డిప్యూటీ కమిషనర్‌కు మరోసారి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు.. రెండు ఫిర్యాదులను తిరిగి తెరిచి, వేరే అధికారితో క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించాలని కోరారు. భవనం కూల్చివేసినట్లు నమోదు చేసిన సమాధానానికి, సంబంధించిన ఆధారాలు పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.. ఫిర్యాదుల నమోదు నుంచి ముగింపు వరకు జరిగిన ప్రక్రియపై విజిలెన్స్ విచారణ చేపట్టి, ఆరోపణల్లో వాస్తవాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.. మున్సిపల్ ఫిర్యాదులను ముగింపు వ్యవహారంపై మధుబాబు పోలీసు శాఖను కూడా ఆశ్రయించారు. నవంబర్ 5న జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో సీవైబీ/జీజేటీఏబీసీవైబీ/051126/03806 ఫిర్యాదు సమర్పించారు.. తన ఫిర్యాదులో భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్లను ప్రస్తావిస్తూ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది.

ఆదిలాబాద్ సర్పంచ్ ఆసిఫ్ ఖాన్‌కు గ్రామంలో ఘన సన్మానం



హైదరాబాద్ పెన్ పవర్: ఆదిలాబాద్: గుజరాత్‌లోని కేవాడియా (ఏక్తా నగర్)లో ఇటీవల నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలకు ఆదిలాబాద్ జిల్లా నుంచి ఏకైక ప్రతినిధిగా హాజరైన ఇచ్చోడ మండలం బోరీగామ సర్పంచ్ ఆసిఫ్ ఖాన్‌కు స్వగ్రామంలో ఘన స్వాగతం లభించింది.

దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ కార్యక్రమానికి హాజరై, విజయవంతంగా తిరిగి గ్రామానికి చేరుకున్న ఆసిఫ్ ఖాన్‌ను గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు ఎంతో ఆత్మీయంగా ఆహ్వానించారు. జిల్లా స్థాయి నుంచి ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకుని, గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చినందుకు గాను గ్రామస్థులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.


ఈ సందర్భంగా ఆసిఫ్ ఖాన్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేవాడియాలో జరిగిన జాతీయ ఐక్యతా దినోత్సవంలో పాల్గొనడం, అక్కడ జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వీక్షించడం మరువలేని అనుభూతిని ఇచ్చిందని అన్నారు. తనపై నమ్మకంతో ఈ కార్యక్రమానికి ఎంపిక చేసినందుకు, తిరిగి వచ్చిన తర్వాత ఇంతటి అభిమానాన్ని చాటిన గ్రామస్థులందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆకిటి బీమ్ రెడ్డి, కుంట రాజేశ్వర్ రెడ్డి, బద్దం వెంకట నరసింహారెడ్డి, దేరే రత్నాకర్ రెడ్డి మాజీ ఎంపీటీసీ కుంట ప్రవీణ్ రెడ్డి, బద్దం మచ్చేందర్ రెడ్డి, ఇటడి లక్ష్మారెడ్డి,బద్దం శరత్ రెడ్డి, కరోబరీ వెంకటస్వామి, మల్లన్న గ్రామ ప్రముఖులు, యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటి వెనుక బాత్రూం లో గంజాయి మొక్క పెంపకం

గంజాయి మొక్కను గుర్తించి స్వాధీనం చేసుకున్న బోథ్ పోలీసులు

నిందితుడిపై చీఐూూ చట్టం ప్రకారం కేసు నమోదు

బోథ్ ఎస్ఐ వి పురుషోత్తం



హైదరాబాద్ పెన్ పవర్: గ్రామంలో ఒక వ్యక్తి తన ఇంటి వెనుక ఉన్న బహిరంగ బాత్రూమ్ ప్రదేశంలో గంజాయి మొక్కను పెంచుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బోథ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

ఈ తనిఖీలలో సోనాల గ్రామానికి చెందిన వ్యక్తి ఇంటి వెనుక పెరట్లో ఒక గంజాయి మొక్కను గుర్తించారు. పరిశీలించి అది గంజాయి మొక్కగా నిర్ధారించారు. మొక్కను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి నిందితుని అరెస్టు చేయడం జరిగింది.నిందితుడు గతంలో గంజాయి సేవించే అలవాటు ఉండటంతో గంజాయి విత్తనాలను సేకరించి, డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రహస్యంగా మొక్కను పెంచుతున్నట్లు విచారణలో వెల్లడించాడు. ఈ ఘటనపై నిందితుడిపై చీఐూూ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు.

నిందితుడి వివరాలు:
చౌహాన్ జైపాల్ సింగ్ (44), ం/శీ నారాయణ్ సింగ్, సోనాల గ్రామం, బోథ్ మండలం.

అమరవీరుల ఆశయాలను సాధిద్దాం

అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐఎంఎస్) జిల్లా సహాయ కార్యదర్శి కా(మేడ్ పుల్లన్న



హైదరాబాద్ పెన్ పవర్: అమరవీరుల స్మారక సభల లో భాగంగా గంగారం మండలం పుట్టల భూపతి తండాలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో గ్రూప్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కామ్రేడ్ పుల్లన్న ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ సమాజంలో దోపిడీ పీడన అసమానతలు లేని నూతన సమాజం కోసం కొనసాగిన భారత విప్లవోద్యమంలో అనేకమంది అమరులు కావడం జరిగింది. వారి త్యాగాల ఫలితంగా నేడు ప్రజలు అనేక సమస్యలను పరిష్కరించుకొని పోడు భూములను సాధించుకున్నారు వారి ఆశయాలను ముందుకు తీసుకపోవడంలో భాగంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. అందులో భాగంగానే నవంబర్ 7న సాయంత్రం ఏడు గంటలకు కొత్తగూడలో జరుగు కామ్రేడ్ పాలడుగు కృష్ణ స్మారక బహిరంగ సభను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, నిర్మల, లక్ష్మణ్, చందు, లక్ష్మి, వినోద, శ్రీను, వెంకన్న, సంజీవరావు, ప్రశాంత్, పాండు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు జిల్లావ్యాప్తంగా గంజాయి స్పెషల్ డ్రైవ్

తెల్లవారుజామున 5 గంటల నుండి 90 మంది అనుమానితుల ఇళ్లలో తనిఖీలు

యూరిన్ డ్రగ్ టెస్టుల ద్వారా 57 మంది గంజాయి సేవించినట్లు నిర్ధారణ

గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యం

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై నిరంతర నిఘా -- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్



హైదరాబాద్ పెన్ పవర్: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుండి జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక గంజాయి తనిఖీ డ్రైవ్ నిర్వహించారు. ఆదిలాబాద్, ఉట్నూర్ పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో గంజాయి సేవిస్తున్నట్లు అనుమానం ఉన్న వ్యక్తులు, గతంలో మాదకద్రవ్యాల వినియోగం, సరఫరా కార్యకలాపాల్లో పాల్గొన్న వ్యక్తుల ఇళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా మొత్తం 90 మందిని తనిఖీ చేయగా, ప్రత్యేక డ్రగ్ టెస్టింగ్ కిట్లు, యూరిన్ టెస్టుల ద్వారా 57 మంది గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయింది. జిల్లాలో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టడంతో పాటు మాదకద్రవ్యాల వినియోగదారులను గుర్తించే లక్ష్యంతో ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లాలో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక నిఘా, ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని ఎస్పీ తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే 8712659973 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. మాదకద్రవ్యాల రహిత జిల్లానే లక్ష్యం.. యువత భవిష్యత్తే మా బాధ్యత.

నాగులవంచలో కోతుల బెడద!

వందల సంఖ్యలో గ్రామంపై కోతుల దండయాత్ర

ఇళ్లలోకి చొరబాటు.. ప్రజలపై దాడులు

భయాందోళనలో గ్రామస్థులు.. అధికారులు స్పందించాలి



హైదరాబాద్ పెన్ పవర్: చింతకాని మండల పరిధిలో ని నాగులవంచ గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. వందల సంఖ్యలో కోతులు గుంపులుగా గ్రామంలో సంచరిస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడుతూ ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా, అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న ప్రజలపై దాడులకు దిగుతుండటంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.గ్రామంలోని వీధులు, ఇళ్ల పరిసరాలు, ఇంటి పైకప్పులపై కోతులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇళ్ల తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. వంటగదుల్లోకి చొరబడి ఆహార పదార్థాలను చిందరవందర చేయడం, ఇంట్లోని వస్తువులను పడేయడం, చేతికి అందిన వస్తువులను ఎత్తుకెళ్లడం వంటి చర్యలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

ముఖ్యంగా చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వీధుల్లో ఒంటరిగా వెళ్లేవారిని కోతులు వెంటపడటం, ఆహార పదార్థాలు చేతిలో కనిపిస్తే లాక్కోవడానికి ప్రయత్నించడం, ఎదురు తిరిగితే దాడులకు దిగడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రమాదకరంగా మారిన కోతుల సంచారం

కోతుల సంఖ్య భారీగా పెరగడంతో గ్రామంలో సాధారణ జనజీవనం కూడా ఇబ్బందులకు గురవుతోంది. ఇంటి ఆవరణల్లోకి, పెరట్లోకి చొరబడుతూ నిత్యావసర వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. ప్రజలు తమ ఇళ్ల వద్ద కూడా స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి ఏర్పడుతోంది.


అధికారులు తక్షణమే స్పందించాలి

కోతుల బెడద నుంచి గ్రామస్థులకు విముక్తి కల్పించేందుకు అటవీశాఖ అధికారులు, సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. నిపుణుల సహాయంతో కోతులను సురక్షితంగా పట్టుకుని తగిన పునరావాస చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కోతుల సమస్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో చిన్నపిల్లలు, వృద్ధులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాగులవంచ గ్రామంలో కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

రాత్రి వేళల్లో రైతుల వ్యవసాయ మోటార్లను చోరీ చేస్తున్న ముఠా..

ఈ ముఠా సమాచారం తెలిసినవారు చింతకాని ఎస్ఐ నరేష్ కి సమాచారం అందించగలరు



హైదరాబాద్ పెన్ పవర్: :గత కొంతకాలంగా ఒక ముఠా చింతకాని మండలంలోని పలు గ్రామాల రైతుల యొక్క వ్యవసాయ మోటార్లను చోరీ చేస్తున్నారు. ఈ తరహాలోనే ఈ నెల 31వ తేదీన చిన్న మండవ గ్రామంలోని వ్యవసాయ మోటార్ల ను చోరీ చేసి ఒక ఆటోలో వెళ్తున్న దృశ్యాలను సీతంపేట గ్రామంలోని సిసి రికార్డులో ఆటో మరియు నలుగురు వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డట్లు అనుమానాలు. ఈ ముఠాపై సమాచారం తెలిసిన వారు ఎవరైనా చింతకాని ఎస్ఐ నరేష్ కి సమాచారాన్ని ఇవ్వగలరు.

ఈ కింది నంబర్లను సంప్రదించి పోలీసు వారికి సమాచారాన్ని ఇవ్వగలరు.
8712659152,
8712659153.

గ్లోబల్ సమిట్‌లో టూరిస్ట్ స్పాట్లను ప్రదర్శించాలి

-3 పేజి తరువాయి

తెలంగాణ ఎడ్యుకేషన్ ప్రతిబింబించేలా చర్చ జరగాలని దిశానిర్దేశం చేశారు. నవంబర్ 15 వరకు ఏర్పాట్ల ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీపై చర్చించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో జరగనున్న సదస్సుపై సమాలోచనలు చేశారు.

విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరం

పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: సర్పంచ్ ఓబినబోయిన లక్ష్మి అచ్చయ్య



హైదరాబాద్ పెన్ పవర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో అవసరమని పాతర్లపాడు గ్రామ సర్పంచ్ ఓబినబోయిన లక్ష్మి అచ్చయ్య అన్నారు.

పాతర్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల చదువుపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి అభిరుచులు, చదువులో పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, సమయాన్ని వృథా చేయకుండా విద్యపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతి నివేదికలను పరిశీలించి, వారి విద్యా పురోగతిపై తల్లిదండ్రులతో చర్చించారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దారెల్లి సురేష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో మామిడి చెట్ల అక్రమ నరికివేత
నలుగురు ఫారెస్ట్ సిబ్బంది సస్పెన్షన్!



హైదరాబాద్ పెన్ పవర్:

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పరిధిలో అక్రమంగా మామిడి చెట్లను నరికివేసిన వ్యవహారం ఫారెస్ట్ శాఖలో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ శాఖ ఉన్నతాధికారులు నలుగురు కింది స్థాయి ఫారెస్ట్ అధికారులను సస్పెండ్ చేశారుఅయితే, అసలు నిందితులను తప్పించి కేవలం కింది స్థాయి సిబ్బందిపైనే చర్యలు తీసుకోవడంపై స్థానికులు, అటవీ శాఖ ఉద్యోగులలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

వివరాల్లోకి వెళితే

గూడూరు మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున మామిడి చెట్లను అక్రమంగా నరికివేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై ప్రాథమిక విచారణ జరిపిన ఉన్నతాధికారులు, విధుల్లో నిర్లక్ష్యం వహించారనే కారణంతో నలుగురు కింది స్థాయి అధికారులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పైస్థాయి అధికారుల పాత్రపై ఆరోపణలు

ఉన్నతాధికారుల సస్పెన్షన్ వేటుపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. భారీ ఎత్తున చెట్ల నరికివేత జరుగుతున్నా పైస్థాయి అధికారులకు తెలియకుండా ఉండే అవకాశం లేదని, వారి అండదండలతోనే ఈ దందా సాగిందని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. నిజమైన సూత్రధారులైన ఉన్నతాధికారులను విచారించకుండా, కింది స్థాయి ఉద్యోగులను బలిపశువులను చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శిస్తున్నారు

దామోదర-లక్ష్మీకాంత రావులపై మహేష్ గౌడ్ సీరియస్ !

హైదరాబాద్, నవంబర్ 5, పెన్ పవర్:
తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో రోజురోజుకూ శృతిమించుతున్న గ్రూపు తగాదాలు, బాహాటంగా రచ్చకెక్కుతున్న క్రమశిక్షణా రాహిత్యంపై టీపీసీసీ నాయకత్వం గట్టిగా దృష్టి సారించింది. పార్టీ నేతల వివాదల్ను పార్టీ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తోందని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయా? పార్టీ సంస్థాగత నియామకాల విషయంలో నేతల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు చివరకు బహిరంగ ఘర్షణకు దారితీసిందా? ఢిల్లీలోని ఓ ప్రముఖ హోటల్ వేదికగా చోటుచేసుకున్నట్లు ప్రచారంలోకి వచ్చిన ఘటన ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు రైతుల సమస్యలు, మరోవైపు పార్టీ వ్యవహారాలు.. వీటన్నింటినీ పక్కనపెట్టి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఢిల్లీలోనే పరస్పరం తలపడినట్లు వస్తున్న వార్తలు పార్టీ ప్రతిష్ఠకు సవాలుగా మారాయి.పార్టీ అధికారంలో ఉన్న వేళ నేతలు సంయమనం పాటించాల్సింది పోయి.. వ్యక్తిగత ఆధిపత్యం, నామినేటెడ్ పదవులు, నియోజకవర్గ వ్యవహారాలపై పరస్పరం దాడులకు దిగడంపై ఆయన సీరియస్ అయ్యారు. అంతర్గత క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై ఎంతటి స్థాయి నేతలైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావుల వివాదాన్ని టీపీసీసీ చీఫ్ తీవ్రమైన అంశంగా పరిగణించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా హోటల్ లాబీలో డీసీసీ అధ్యక్ష పదవి, సంస్థాగత నియామకాల విషయంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి, సహచర ఎమ్మెల్యేల ముందే బాహాబాహీకి దిగే స్థాయికి వెళ్లడం పార్టీ వర్గాల్లో పెను దుమారం రేపింది. తోటి ఎమ్మెల్యేల సమక్షంలో మంత్రి దామోదర తనపై తీవ్ర పదజాలంతో దూషణలకు దిగారని ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావు ఇప్పటికే పీసీసీకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటన పార్టీ హైకమాండ్ దృష్టికి కూడా వెళ్లింది. ఈ వివాదంపై పూర్తి విచారణ జరిపేందుకు బుధవారం నాడు గాంధీ భవన్‌కు స్వయంగా హాజరుకావాల్సిందిగా మంత్రి దామోదర, ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావులకు పీసీసీ చీఫ్ ఆదేశాలు జారీ చేశారు.మంత్రి, ఎమ్మెల్యే వివాద పరిష్కారం తర్వాత.. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లో ఇటీవల చోటుచేసుకున్న వరుస క్రమశిక్షణా ఉల్లంఘనలపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని పీసీసీ నిర్ణయించింది. ఢిల్లీలోని శాంగ్రిలా హోటల్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు సమాచారం. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల నియామకాలకు సంబంధించి ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. తమ వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న పట్టుదల, పార్టీ పదవుల పంపకాలపై అసంతృప్తి ఈ వివాదానికి కారణమన్న ప్రచారం జరుగుతోంది.ఈ క్రమంలో హోటల్ లాబీలోనే ఇద్దరి మధ్య మాటామాటా పెరిగినట్లు సమాచారం. 'రూములో వేసి నీ గురించి ఏం అనుకుంటున్నావు?' అంటూ మంత్రి దామోదర రాజనర్సింహ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో ఇద్దరూ పరస్పరం దాడికి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఒకరినొకరు కొట్టుకునే స్థాయికి వివాదం వెళ్లిందన్న వార్త రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది.



ఇతర ఎమ్మెల్యేల ముందే అవమానం?
ఈ ఘటన సమయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఓ సీనియర్ జర్నలిస్ట్ అక్కడే ఉన్నట్లు సమాచారం. ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో మంత్రి తనను దూషించి అవమానించారని లక్ష్మీకాంతరావు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఆయన ఇప్పటికే పీసీసీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అంతటితో ఆగకుండా పార్టీ అధిష్ఠానానికి కూడా ఫిర్యాదు చేయాలని యోచిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.ఈ వ్యవహారం నిజంగా ఎంతవరకు వెళ్లింది? ఇద్దరు నేతల మధ్య వివాదానికి అసలు కారణాలేమిటి? పార్టీ పెద్దలు ఈ అంశాన్ని ఎలా పరిష్కరిస్తారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయఈ ఘటన రాజకీయంగా మరో కీలక చర్చకు తెరలేపింది. తెలంగాణలో రైతులు వివిధ సమస్యలతో సతమతమవుతున్న సమయంలో అధికార పార్టీ నేతలు మాత్రం పార్టీ పదవులు, వర్గ రాజకీయాల కోసం ఢిల్లీలోనే ఘర్షణలకు దిగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు తమలో తాము ఆధిపత్య పోరుకు దిగడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి, ప్రజల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే మధ్యే సఖ్యత లేకపోతే పార్టీ కేడర్‌కు ఎలాంటి సందేశం వెళ్తుందన్నది మరో ప్రశ్న. జిల్లా స్థాయి పార్టీ పదవుల విషయంలోనే నేతలు సంయమనం కోల్పోతే, ప్రభుత్వ పాలనలో సమన్వయం ఎలా ఉంటుందన్న విమర్శలకు ఈ పరిణామం అవకాశం కల్పిస్తోంది.

అధిష్ఠానం జోక్యం తప్పనిసరేనా?
కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు కొత్తేమీ కాకపోయినా, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అంతర్గత విభేదాలు ఇలాంటి స్థాయికి చేరుతున్నాయన్న ప్రచారం పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఈ వివాదం పీసీసీ పరిధిలోనే ముగుస్తుందా? లేక ఢిల్లీ పెద్దల వరకు చేరుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.డీసీసీ అధ్యక్షుల నియామకాల కోసం మొదలైనట్లు చెబుతున్న వివాదం ఇప్పుడు మంత్రి, ఎమ్మెల్యే మధ్య వ్యక్తిగత ఘర్షణగా మారిందన్న వార్త కాంగ్రెస్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. రైతుల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో నేతల మధ్య ఈ తరహా పరిణామాలు చోటుచేసుకోవడం పార్టీకి రాజకీయంగా ఎంతమేర నష్టం కలిగిస్తుందో వేచి చూడాలి.హోటల్‌లో జరిగినట్లు ప్రచారంలో ఉన్న ఘర్షణకు సంబంధించి ఇరువురు నేతల అధికారిక స్పందన, స్వతంత్ర ధ్రువీకరణ అందుబాటులోకి వచ్చిన తర్వాత పూర్తి వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.ప్రధానంగా నియోజకవర్గ నిధుల పంపిణీ, స్థానిక సంస్థల సమన్వయం, అధికార వర్గాల బదిలీల విషయంలో మంత్రులపై బహిరంగంగా గళమెత్తుతున్న అసంతృప్త ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల వ్యవహార శైలిపై పార్టీ అధిష్ఠానం నివేదికలు సిద్ధం చేస్తోంది. మునుగోడు, జడ్చర్ల వంటి స్థానాల్లో సొంత పార్టీ ప్రజాప్రతినిధులే ప్రభుత్వంపై విరుచుకుపడుతుండటం, జిల్లాల్లో డీసీసీ అధ్యక్షుల నియామకాల వేళ వర్గపోరు భగ్గుమంటున్న పరిస్థితులన్నింటినీ సమీక్షించి ఆయా నేతలకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు హెచ్చరికలు జారీ చేయనున్నారు.

భూముల అమ్మకమే ఆదాయ మార్గమా...

హైదరాబాద్, నవంబర్ 5, పెన్ పవర్:
మియాపూర్‌లో 550 ఎకరాల ప్రభుత్వ భూములపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి భారీ విజయాన్ని అందించింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత విలువైన ప్రభుత్వ భూములపై హక్కులను రాష్ట్రం తిరిగి సాధించుకుంది. అయితే ఈ భూములను విక్రయించి ప్రభుత్వ పాఠశాలలు, ఇందిరమ్మ ఇళ్లు, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు సమకూరుస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన ఇప్పుడు కొత్త చర్చకు తెరలేపింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన భూముల విక్రయ విధానాన్నే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందా? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.తెలంగాణలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, వాటి వినియోగం ఇప్పుడు రాజకీయంగా కీలక అంశంగా మారింది. మియాపూర్‌లోని 550 ఎకరాల విలువైన భూములపై సుప్రీంకోర్టు తీర్పు రావడం ప్రభుత్వానికి పెద్ద ఊరటనిచ్చింది. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు న్యాయపోరాటం చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే. అయితే ఈ విజయం తర్వాత ఆ భూములను అమ్మి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చుకోవాలన్న రేవంత్ రెడ్డి ఆలోచన మాత్రం ఆర్థిక విధానంపై చర్చకు దారితీస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వ భూకేటాయింపులపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో హిల్స్ వంటి భూముల కేటాయింపుల విషయంలో కేసీఆర్, హరీశ్ రావు గతంలో అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. పదేళ్ల అధికారంలో వాటిని ఎందుకు వెనక్కి తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఒక వైఖరి, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో వైఖరి ఎందుకు అనుసరించారని నిలదీస్తున్నారు.అంతేకాకుండా కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ సమీపంలో శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ ఏర్పాటు చేస్తామని రేవంత్ ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు అందించాలన్నది ఈ ప్రతిపాదన లక్ష్యంగా పేర్కొన్నారు. ఎర్రవల్లి, షేర్ వెంకటాపూర్ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూముల వ్యవహారంపైనా ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు.సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, ఇప్పటివరకు 345 ఎకరాలను మాత్రమే గుర్తించారని, మరో 43 ఎకరాల ఆచూకీ తేలాల్సి ఉందని వెల్లడించారు. ఈ రెండు గ్రామాల్లో సమగ్ర భూ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూమిలేని అర్హులైన పేదలకు పట్టాలు పంపిణీ చేస్తామని, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అయితే ప్రభుత్వ భూములను విక్రయించి ఆదాయం సమకూర్చుకోవడం తెలంగాణలో కొత్త విధానం కాదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. 2021 జూలైలో కోకాపేటలో దాదాపు 50 ఎకరాల భూములను వేలం వేయడం ద్వారా సుమారు రూ.2,000 కోట్ల ఆదాయం సమకూర్చుకుంది. 2023 ఆగస్టులో కోకాపేట, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన భూముల వేలం ద్వారా సుమారు రూ.7,100 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది.నియోపోలిస్ భూముల వేలం ద్వారా రూ.3,319.60 కోట్లు, బుద్వేల్ భూముల ద్వారా రూ.3,625.73 కోట్ల ఆదాయం లభించింది. అంతేకాకుండా ఔటర్ రింగ్ రోడ్డును టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ప్రైవేట్ సంస్థకు అప్పగించడం ద్వారా ప్రభుత్వం ముందస్తుగా రూ.7,380 కోట్ల ఆదాయాన్ని పొందింది. అంటే ప్రభుత్వ ఆస్తులను నగదుగా మార్చుకోవడం గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్థిక వ్యూహంలోనూ కీలక భాగంగా ఉంది.అయితే భూముల అమ్మకాల ద్వారా భారీ ఆదాయం వస్తుందని అంచనా వేసినా, ఆ అంచనాలను వాస్తవ ఆదాయంతో సరిపోల్చడంలో గత ప్రభుత్వం విఫలమైందని కాగ్ నివేదికలు తప్పుబట్టాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నివేదికలో భూములు, ఆస్తుల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంపై ప్రభుత్వం అధిక అంచనాలు వేసిందని కాగ్ ప్రస్తావించింది. గత అంచనాలు నెరవేరకపోయినా మళ్లీ భారీ ఆదాయ అంచనాలు చూపించడం ఆర్థిక నిర్వహణలో సమస్యలకు దారితీస్తుందని సూచించింది.ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ప్రభుత్వ భూములు ఒక పరిమితమైన సంపద. ఒకసారి వాటిని విక్రయిస్తే తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడం అంత సులభం కాదు. పాఠశాలల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులు, పేదలకు ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు అత్యంత అవసరమైనవే. కానీ అలాంటి పథకాల కోసం ప్రభుత్వ భూములను విక్రయించడమే ప్రధాన ఆదాయ మార్గంగా మారితే భవిష్యత్తులో పరిస్థితి ఏమిటన్నది ఆలోచించాల్సిన అంశం.ముఖ్యంగా ఒకసారి వచ్చే భూముల అమ్మకాల ఆదాయాన్ని ప్రతి ఏడాది ఖర్చు చేయాల్సిన సంక్షేమ పథకాలకు ఉపయోగించడం ఆర్థికంగా ఎంతవరకు సమంజసం? ప్రభుత్వ పాఠశాలలు, సాగునీటి ప్రాజెక్టుల వంటి దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల కల్పనకు ఆ నిధులను వినియోగించడం ఒక కోణమైతే, నిరంతరం ఖర్చు చేయాల్సిన పథకాలకు ఒకేసారి వచ్చే ఆదాయాన్ని ఆధారంగా చేసుకోవడం మరో కోణం. సంక్షేమ పథకాలకు ప్రతి సంవత్సరం స్థిరమైన ఆదాయ వనరులు అవసరం. భూముల అమ్మకాల ద్వారా వచ్చే డబ్బు ఎప్పటికీ అందుబాటులో ఉండదు.గత ప్రభుత్వ భూవ్యవహారాలను ప్రశ్నిస్తున్న రేవంత్ రెడ్డికి ఇప్పుడు తన విధానాన్ని నిరూపించుకునే అవకాశం ఉంది. మియాపూర్ భూములను విక్రయించాలని నిర్ణయిస్తే.. వాటి ద్వారా ఎంత ఆదాయం వస్తుంది? ఆ నిధులను ఏయే పథకాలకు కేటాయిస్తారు? వాటి వినియోగంపై ఎలాంటి పర్యవేక్షణ ఉంటుంది? భవిష్యత్తులో ప్రభుత్వ ఆస్తులు కరిగిపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు? వంటి అంశాలపై ప్రభుత్వం

స్పష్టమైన ప్రణాళికను ప్రజల ముందుంచాలి.ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణల నుంచి కాపాడటం ఎంత ముఖ్యమో, వాటిని భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉంచడం కూడా అంతే ముఖ్యం. మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు దక్కిన విజయం. ఆ విజయాన్ని మరో భూముల విక్రయానికి అవకాశంగా చూడటం మాత్రం సరైన విధానం కాకపోవచ్చు.కేసీఆర్ ప్రభుత్వం భూముల విక్రయాల ద్వారా ఆదాయం సమకూర్చుకునే విధానానికి బలమైన, దీర్ఘకాలిక ఆర్థిక ప్రత్యామ్నాయాన్ని చూపించలేకపోయిందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు అదే విధానాన్ని విమర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడిస్తే తేడా ఏముంటుంది? రాజకీయ విమర్శలకు అతీతంగా ప్రజా ఆస్తుల నిర్వహణలో కొత్త ప్రమాణాలను నెలకొల్పాల్సిన బాధ్యత రేవంత్ ప్రభుత్వంపై ఉంది.ప్రభుత్వాలు భూములను అమ్మి తాత్కాలికంగా డబ్బు సమకూర్చుకోవడం కంటే, కొత్త సంపదను సృష్టించడం, ఆదాయ వనరులను పెంచడం, ప్రభుత్వ ఆస్తులను సమర్థంగా వినియోగించుకోవడంపై దృష్టి పెట్టాలి. రాజకీయ హామీల అమలు కోసం తరతరాల సంపదను విక్రయించడం తాత్కాలిక పరిష్కారమే తప్ప శాశ్వత ఆర్థిక విధానం కాదు. తెలంగాణ భవిష్యత్తు కోసం భూముల అమ్మకాల కంటే స్థిరమైన ఆదాయ మార్గాలే కీలకం.

రౌడీ షీటర్లపై సిరిసిల్ల పోలీసుల డేగకన్ను!

హైదరాబాద్, నవంబర్ 5, పెన్ పవర్: జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల ఇళ్లలో పోలీసులు ఆకస్మిక రాత్రి తనిఖీలు నిర్వహించారు.ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హెచ్చరించారు. నేరాలకు దూరంగా సత్ప్రవర్తనతో జీవించాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. పూర్తిగా ప్రవర్తన మార్చుకున్న వారి షీట్లను నిబంధనల ప్రకారం తొలగిస్తామని స్పష్టం చేశారు.

తూప్రాన్‌లో పోలీసుల భారీ కార్డన్ సెర్చ్.. 450కి పైగా ఇళ్లలో తనిఖీలు, పత్రాలు లేని 64 వాహనాలు స్వాధీనం

హైదరాబాద్, నవంబర్ 5, పెన్ పవర్: నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా తూప్రాన్ పట్టణంలోని 2 బీహెచ్ కె కాలనీలో ఈరోజు మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ (కార్డన్ సెర్చ్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 105 మంది పోలీసు సిబ్బంది పాల్గొని 450కు పైగా ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 61 ద్విచక్ర వాహనాలు, 3 త్రిచక్ర వాహనాలు (మొత్తం 64) స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాల ఉనికిని గుర్తించేందుకు నార్కోటిక్ డాగ్ 'జూబి' సహాయంతో అణువణువూ తనిఖీలు చేశారు.ఫింగర్‌ప్రింట్ డివైజ్‌ల ద్వారా పాత నేరస్థుల వివరాలను గుర్తించే ప్రక్రియ చేపట్టారు."ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ఉద్దేశం సాధారణ ప్రజలను ఇబ్బంది పెట్టడం కాదు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి ప్రజల భద్రతకు భరోసా కల్పించడమే. మీ పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి" అని అదనపు ఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ , సీఐలు వెంకటరాజ్ గౌడ్, రంగకృష్ణ, ఎస్సైలు, సీసీఎస్, షీ టీమ్స్, డాగ్ స్క్వాడ్ బృందాలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

తెలంగాణలో భారీగా మిగిలిపోయిన ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, నవంబర్ 5, పెన్ పవర్: హైదరాబాద్ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహించిన నీట్-యూజీ 2026 కౌన్సెలింగ్ పలు విడతలుగా పూర్తయినప్పటికీ, రాష్ట్రంలోని ప్రైవేట్ వైద్య కళాశాలల్లో కనీసం 175 ఎంబీబీఎస్ సీట్లు ఖాళీగా మిగిలిపోయాయి. ఈ భర్తీ కాని సీట్లన్నీ ప్రైవేట్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా (కేటగిరీ-బి), ఎన్ఆర్ఐ కోటా (కేటగిరీ-సి) పరిధిలోనివే కావడం గమనార్హం. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఫీజులు చాలా తక్కువగా ఉండటం, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో అక్కడ అన్ని సీట్లు భర్తీ అయ్యాయని జాయింట్ రిజిస్ట్రార్ జె. వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఇలా ప్రైవేట్ కాలేజీల్లో పెద్ద సంఖ్యలో సీట్లు మిగిలిపోవడం ఇదే తొలిసారి అని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ కాలేజీలలో బి-కేటగిరీ సీట్లకు వార్షిక ఫీజు రూ.10 లక్షల నుంచి రూ.11 లక్షల వరకు ఉండగా, ఎన్ఆర్ఐ కోటాకు రూ.24 లక్షల నుండి రూ.25 లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే ప్రైవేట్ యాజమాన్యాలు హాస్టల్ వసతి, ఇతర నిబంధనల పేరుతో అదనపు మొత్తాలను వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కేటగిరి-ఎ విద్యార్థుల నుంచి సైతం నిబంధనల ప్రకారం ఉన్న రూ.60,000 ఫీజుకు బదులుగా రూ.2.5 లక్షల నుండి రూ.3 లక్షల వరకు దండుకుంటున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంబీబీఎస్ పూర్తైన తర్వాత డ్యూటీ మెడికల్ ఆఫీసర్లుగా చేరే వైద్యులకు నెలకు రూ. 20,000 నుండి రూ. 30,000 మాత్రమే వేతనం లభిస్తోంది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తే తప్ప మంచి అవకాశాలు లభించకపోవడం, మరోవైపు ఇంజినీరింగ్ అభ్యర్థులకు లక్షల రూపాయల ప్యాకేజీలు రావడం వైద్య రంగానికి పెద్ద సవాలుగా మారింది. రాష్ట్రంలో 10,000 కంటే ఎక్కువ ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, వాటిలో 6,000 పైగా సీట్లు 29 ప్రైవేట్ కాలేజీల్లోనే ఉన్నాయి. ఎన్ఎంసీ ఇటీవల 2026-27 విద్యాసంవత్సరానికి మంజూరు చేసిన 1,010 అదనపు సీట్లలో ప్రైవేట్ రంగానికే 900 సీట్లు రావడం విశేషం. వైద్య విద్యపై విద్యార్థులకు ఆసక్తి తగ్గడం వల్ల ఈ సీట్లు ఖాళీగా మిగలలేదని, కేవలం ఆర్థిక భారం, ఇతర కారణాల వల్లే అర్హులైన విద్యార్థులు తమ కలలను వదులుకోవాల్సి వస్తోందని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కార్తీక్ నాగుల అభిప్రాయపడ్డారు. ప్రైవేట్ కాలేజీలు ఎందుకు ఫీజులను విపరీతంగా పెంచుతున్నాయో తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణపై ఎల్‌నీనో ఎఫెక్ట్.. బోర్‌వెల్స్‌కు ఎన్‌వోసీ తప్పనిసరి

హైదరాబాద్, నవంబర్ 5, పెన్ పవర్:
ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జల మట్టాలు పడిపోకుండా చూడటం, లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో జల వనరులను సంరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తాగునీటి అవసరాలు తప్ప ఇతర పనులకు శుద్ధి చేసిన మురుగు నీటిని మాత్రమే వినియోగించాలని స్పష్టం చేస్తూ ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. 2027 జులై చివరి వరకు అమల్లో ఉండేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జీవో 259 ద్వారా ఈ ఉత్తర్వులను జారీ చేశారు.
జీవో 259లోని ముఖ్యమైన నిబంధనలుఅపార్ట్‌మెంట్‌లు, గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్టులు, వాణిజ్య-పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్లు, బల్క్ వాటర్ సప్లైయర్లు భూగర్భ జలాల వినియోగ నిబంధనలు-2023 ప్రకారం నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ పొందిన తర్వాతే కొత్త బోర్లు తవ్వాల్సి ఉంటుంది.అనుమతులతో బోర్‌వెల్ తవ్వకం పూర్తి చేసిన 15 రోజుల్లోగా రిగ్ ఆపరేటర్ నిర్ణీత అధికారికి 'వెల్ కంప్లీషన్ రిపోర్ట్'ను సబ్మిట్ చేయాలి. ఆ బోర్‌వెల్‌ను సంబంధిత తహసీల్దార్ వద్ద తప్పనిసరిగా నమోదు చేయించాలి.నిర్మాణ ప్రాజెక్టులు, తోటల పెంపకం, ల్యాండ్‌స్కేపింగ్, రోడ్ల శుభ్రత వంటి అవసరాలకు భూగర్భ జలాలను వాడకూడదు. జలమండలి అందుబాటులోకి తెచ్చిన శుద్ధి చేసిన మురుగు నీటిని మాత్రమే వినియోగించాలి.భూగర్భ జలాలను అక్రమంగా వెలికితీసినా లేదా దుర్వినియోగం చేసినా 'వాల్టా' చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారు.ప్రతిఒక్కరూ వాననీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.భూగర్భజల శాఖ: నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన సంరక్షణ చర్యలు చేపట్టాలి.మున్సిపల్ కార్పొరేషన్లు: భవన నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణాలను తప్పనిసరిగా అమలు చేయించాలి.
హైడ్రా : చెరువులు, కుంటలు, నీటి రీఛార్జ్ ప్రాంతాలను ఆక్రమణలు, వ్యర్థాల డంపింగ్, కాలుష్యం నుంచి కాపాడాలి.మంచి నీటి సరఫరా పైప్‌లైన్ నెట్‌వర్క్‌లో లీకేజీలు, వృథాను అరికట్టడంతో పాటు కంటింజెన్సీ మానిటరింగ్ కమిటీకి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదిక అందించాలి.

22 ఏ రిజిస్ట్రేషన్లకు లైన్ క్లియర్

హైదరాబాద్, నవంబర్ 5, పెన్ పవర్:
తెలంగాణలో ఓపెన్ ప్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేసి ఏళ్ల తరబడి నిషేధిత జాబితా చిక్కుముడుల్లో పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్న లక్షలాది మంది సామాన్యులకు, రియల్ ఎస్టేట్ వర్గాలకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. దశాబ్దాల క్రితం లేఅవుట్ అనుమతులు పొంది, నాన్-నాలా నిబంధనలు కలిగిన ఆస్తులు సాంకేతిక లోపాలు , బేస్ సర్వే నంబర్ల బ్లాకింగ్ కారణంగా 22-ఏ నిషేధిత జాబితాలో నిలిచిపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర నష్టపోయారు. ఈ సమస్యపై సమగ్ర విచారణ చేపట్టిన ప్రభుత్వం, చట్టబద్ధమైన అనుమతులు ఉన్న నాన్-నాలా ప్లాట్లు, ఇళ్ల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.రెవెన్యూ శాఖ జారీ చేసిన తాజా ఆదేశాల ప్రకారం.. జీహెచ్ఎంసీ , హెచ్ఎండీఏ , డీటీసీపీ , మున్సిపాలిటీలు , నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన అప్రూవ్డ్ లేఅవుట్లకు సంబంధించిన ఆస్తులు 22-ఏ జాబితాలో ఉన్నప్పటికీ వాటి రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. లింక్ డాక్యుమెంట్లు, బిల్డింగ్ లేదా లేఅవుట్ అనుమతి పత్రాలు పక్కాగా ఉన్న సందర్భాల్లో నిషేధిత జాబితా ఆంక్షలు వర్తించవు. ఈ నిర్ణయంతో రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా 264కి పైగా కాలనీలు , లేఅవుట్లలో చిక్కుకుపోయిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్ స్వేచ్ఛ లభించింది.అంతేకాకుండా, సాగు భూముల్లో గతంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన అర్హమైన నాలా దరఖాస్తుల పరిష్కారానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. న్యాయ వివాదాలు లేని ఆస్తులకు నిర్ణీత నాలా రుసుముతో పాటు పారదర్శక నిబంధనలను వర్తింపజేస్తూ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దరఖాస్తుదారుల డాక్యుమెంట్లను డిజిటల్ డేటాతో సరిచూసి, ఆన్‌లైన్ వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే బయోమెట్రిక్ విధానంలో వేగంగా డిజిటల్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు.ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎక్కడైనా క్షేత్రస్థాయి సాంకేతిక ఇబ్బందులు లేదా శాఖల మధ్య వ్యత్యాసాలు ఎదురైతే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కలెక్టర్ల నేతృత్వంలో ప్రత్యేక 'జిల్లా స్థాయి కమిటీల'ను కూడా బాధ్యులుగా నియమించారు.ప్రభుత్వ తీసుకున్న ఈ సాహసోపేత నిబంధనల సవరణ వల్ల ఏళ్ల తరబడి నిలిచిపోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి పుంజుకోవడమే కాకుండా, మధ్యతరగతి ప్లాట్ల యజమానులకు తమ సొంత ఆస్తులపై పూర్తి హక్కులు దక్కనున్నాయి

చక్రపాణి యాదవ్‌కు బొంతు శ్రీదేవి యాదవ్ ఘన నివాళి



కాప్రా, పెన్ పవర్, నవంబరు 5: అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, శాసన మండలి మాజీ చైర్మన్ చక్రపాణి యాదవ్ పార్థివ దేహానికి అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, చర్లపల్లి మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ఘనంగా నివాళులర్పించారు.బంజారాహిల్స్‌లోని చక్రపాణి యాదవ్ స్వగృహానికి వెళ్లిన ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.చక్రపాణి యాదవ్ తనకు గురువుగా ఉండి, యాదవ సమాజ అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని శ్రీదేవి యాదవ్ పేర్కొన్నారు. యాదవ సమాజానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

కరువు మండలంగా గార్లను ప్రకటించాలి

ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలి: సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్ సారథి



కరువు ప్రాంతంలో పర్యటించిన సిపిఐ బృందం

గార్ల, పెన్ పవర్, నవంబర్: 5వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి తీవ్రంగానష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, గార్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్ సారథి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాలోని కరువు ప్రభావిత ప్రాంతాల క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా గురువారం సీపీఐ జిల్లా బృందం మండల పార్టీ నాయకులతో కలిసి గార్ల మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించింది. వర్షాభావంతో ఎండిపోయిన పత్తి, మిర్చి, వరి పంటలను పరిశీలించి బాధిత రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా రైతులు తమ పంటలకు పెట్టిన పెట్టుబడులు సైతం తిరిగి వచ్చే పరిస్థితి లేదని, వర్షాలు లేక పంటలు పూర్తిగా ఎండిపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నాయకుల దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం విజయ్ సారథి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల పంట రుణాలను మాఫీ చేయడంతో పాటు ఉపాధి హామీ పనులను పెంచి వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్, మండల కార్యదర్శి జంపాల వెంకన్న, నాయకులు మెదరమెట్ల గిరిప్రసాద్, రాగం రమేష్, భూక్యా హరి నాయక్, ధూపాటి జనార్దన్, రవీందర్ నాయక్, కట్టెబోయిన పిచ్చయ్య, సింగు రమేష్, లకావత్ బీముడు, చెవుకుల బిక్షం, ధరావత్ సురేష్, గుగులోతు సక్రు తదితరులు పాల్గొన్నారు.

అజీమ్ ప్రేమ్‌జీ ఉపకార వేతనానికి గార్ల విద్యార్థిని ఎంపిక

ఏటా రూ.30 వేల ఆర్థిక సాయం.. ఐదేళ్ల పాటు అందజేత



స్కాలర్షిప్ ఫామ్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాజు

గార్ల, పెన్ పవర్, నవంబర్ :5 మహబూబాబాద్ జిల్లా గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అజ్మీర ద్రాక్ష వేణి అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ అందించే ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా కొనసాగించాలనే లక్ష్యంతో ఫౌండేషన్ ఈ స్కాలర్‌షిప్‌ను అందిస్తోంది.ఈ ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థినికి ప్రతి సంవత్సరం రూ.30 వేల చొప్పున ఐదేళ్ల పాటు ఆర్థిక సహాయం అందనుంది. డిగ్రీ విద్యను కొనసాగించేందుకు ఈ ఆర్థిక సాయం ఎంతగానో ఉపయోగపడనుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి విద్యార్థిని ఈ ఉపకార వేతనానికి ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని ద్రాక్ష వేణిని అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ మింగేశారు.. రోడ్లను వదల్లేదు

నాచారం టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద యథేచ్ఛగా ఆక్రమణలు

ఫుడ్‌కోర్టులతో ట్రాఫిక్ జామ్‌లు

తరచూ ప్రమాదాలు

అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం..

నెలవారీ మామూళ్ల ఆరోపణలు



కాప్రా, పెన్ పవర్, నవంబరు 5: ఉప్పల్ నియోజకవర్గం నాచారం టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ పరిసర ప్రాంతంలో ఫుట్‌పాత్ ఆక్రమణలు నానాటికీ విస్తరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను కొందరు వ్యాపారులు ఆక్రమించి ఫుడ్‌కోర్టులు, ఇతర వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తుండటంతో ప్రజలకు నడిచే దారి లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కిలోమీటర్ల మేర ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికావడంతో పాదచారులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రధాన రోడ్డుపైనే నడవాల్సి వస్తోందని చెబుతున్నారు. మరోవైపు ఫుడ్‌కోర్టుల వద్ద భారీ వాహనాలను రోడ్లపై నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ఎక్కడ?

ఫుట్‌పాత్ ఆక్రమణలు బహిరంగంగానే కొనసాగుతున్నప్పటికీ సంబంధిత మున్సిపల్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆక్రమణలపై ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మామూళ్ల ఆరోపణలపై విచారణ జరపాలి

ఆక్రమణదారుల నుంచి కొందరు కింది స్థాయి సిబ్బందికి నెలవారీ మామూళ్లు అందుతున్నందువల్లే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను నిగ్గుతేల్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి విముక్తి చేసి, పాదచారుల భద్రతతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు చదువే పునాది

తల్లిదండ్రుల సమావేశంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





కాప్రా, పెన్ పవర్, నవంబరు 5: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, ఉప్పల్ నియోజకవర్గం మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఎమ్మెల్యే బండారి పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, సమయపాలన అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ వారి మార్గదర్శకత్వంలో ముందుకు సాగాలని అన్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా ఆత్మవిశ్వాసం, పట్టుదలతో కృషి చేస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అధ్యక్షతన ఈ సమావేశం లో విద్యార్థుల విద్యాభివృద్ధి, భవిష్యత్తు లక్ష్యాలు, క్రమశిక్షణ, ఉన్నత విద్య ప్రాధాన్యతపై ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు.

గణిత ఉపాధ్యాయుడిని నియమించాలి

సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో గణిత శాస్త్ర బోధనకు ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన బండారి లక్ష్మారెడ్డి సమస్యను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్,గుండారపు శ్రీనివాస్ రెడ్డి,గొల్లూరి అంజయ్య, నాయకులు మల్లేష్ గౌడ్, గుమ్మడి జంపాల్ రెడ్డి, ప్రసాద్, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, చారి, దేవేందర్ కుమార్, దండెం నరేందర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లో నిధుల మంటలు



మహబూబ్ నగర్, నవంబర్ 5, పెన్ పవర్,

:తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా పార్టీ అంతర్గత విభేదాలు మాత్రం నివురుగప్పిన నిప్పులా రగులుతూనే ఉన్నాయి. ఒకవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మరోవైపు జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి నేరుగా తమ సొంత ప్రభుత్వంపైనే అసంతృప్తి వ్యాఖ్యలు చేయడం, విమర్శల బాణాలు ఎక్కుపెట్టడం టీపీసీసీలో పెను దుమారం రేపుతోంది. ఇద్దరు ఎమ్మెల్యేల వేదన, ఆరోపణలు దాదాపు ఒకే తీరుగా ఉన్నాయి--- నియోజకవర్గాలకు అభివృద్ధి నిధులు రావడం లేదు, మంత్రివర్గంలో తగిన ప్రాధాన్యత దక్కలేదు, నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేల తరహాలోనే పోరాడాల్సి వస్తోంది అని వారు బహిరంగంగానే తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ అసంతృప్తి వెనుక కేవలం నిధులు, మంత్రి పదవుల ఆశలు మాత్రమే కాక టెండర్ల కేటాయింపుల్లో ప్రాధాన్యత దక్కకపోవడం కూడా ఉందనే ఆరోపణలు నడుస్తున్నాయి. హైదరాబాద్ రేడియల్ రోడ్ల టెండర్ల విషయంలో ఏపీకి చెందిన కాంట్రాక్టర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని, లోకల్ కాంట్రాక్టర్లను పక్కనబెట్టారని రాజగోపాల్ రెడ్డి నేరుగా సీఎంఓ నిఘా, టెండర్ల కేటాయింపులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించడం కేడర్‌ను షాక్‌కు గురిచేసింది. మరోవైపు, జడ్చర్ల నియోజకవర్గంలో రోడ్డు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడం, ఫండ్స్ విడుదల కాకపోవడంతో అనిరుధ్ రెడ్డి ఆమరణ దీక్షకు హెచ్చరికలు జారీ చేసే దాకా పరిస్థితి దాటింది.అయితే, ఈ ఇద్దరి అసంతృప్తుల వెనుక పొలిటికల్ అజెండాలు ఉన్నాయనే భావనతో సీఎం రేవంత్ రెడ్డి, ఆయన కోటరీ దీనిని లైట్ తీసుకుంటున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజగోపాల్ రెడ్డికి సుదీర్ఘ రాజకీయ అనుభవం, కోమటిరెడ్డి బ్రదర్స్ ఇమేజ్ ఉన్నప్పటికీ, ఆయన గతంలో పార్టీ మారిన నేపథ్యం ఉండటంతో హైకమాండ్ వద్ద ఆయన ఒత్తిళ్లకు తలొగ్గకూడదని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. సీనియర్లకు పదవులు ఇస్తూ పోతే కొత్తగా వచ్చిన వారికి లేదా రేవంత్ విధేయులకు అవకాశాలు దక్కవనే వ్యూహంతోనే వీరి కామెంట్లను ప్రభుత్వం తీవ్రంగా పట్టించుకోకుండా ఉపేక్షిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇక ఇద్దరు ప్రజాప్రతినిధులు రోడ్డెక్కి విమర్శలు చేస్తుంటే, వారికి సర్దిచెప్పడంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లేదా పార్టీ సీనియర్ నాయకత్వం విఫలమవుతోందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అసంతృప్త నేతలను పిలిచి మాట్లాడి క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, అసమ్మతి వ్యాఖ్యలు చేస్తే చర్యలు ఉంటాయంటూ హెచ్చరికలు జారీ చేయడం మంటలపై నెయ్యి పోసినట్లు పనిచేస్తోంది. పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించాల్సిన సమస్యలు మీడియా ముందుకు రావడం చూస్తుంటే, పీసీసీ అధ్యక్షుడికి , ఎమ్మెల్యేలకు మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అంతర్గత తిరుగుబాటు రూపంలో పెద్ద చికాకులు తప్పవు. ఇప్పుడు రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఓపెన్‌గా గళం విప్పుతుండటంతో, లోలోపల నిధులు రాక, హామీలు నెరవేర్చలేక సతమతమవుతున్న మరికొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా వీరికి మద్దతుగా నిలిచే అవకాశాలు లేకపోలేదు. అసెంబ్లీలో మెజారిటీకి ముప్పు లేకపోయినప్పటికీ, స్వపక్ష ఎమ్మెల్యేలే రెబెల్స్ గా మారి అవినీతి, నిధుల మళ్లింపు ఆరోపణలు చేస్తే.. అది ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలకు ఉచితంగా పొలిటికల్ ఆయుధాలను అందించినట్లవుతుంది. స్థానిక ప్రజాప్రతినిధులకు నిధుల కొరత, ప్రాధాన్యతలేమి అనేది కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలకే పరిమితమైన సమస్య కాదు. రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి అసంతృప్త నేతలతో సమావేశమై టెండర్లు, నిధుల విడుదల మరియు పదవుల భర్తీపై స్పష్టమైన భరోసా ఇవ్వకపోతే, ఈ చిన్న నిప్పు రాబోయే రోజుల్లో రేవంత్ సర్కార్ స్థిరత్వాన్ని, ఇమేజ్‌ను దెబ్బతీసే పెద్ద దావానలంగా మారే ప్రమాదం ఉంది.

వ్యక్తి వెనుకే నడిచిన ఓటు
భారీగా గెలిచిన స్వతంత్రులు, రెబల్స్

విజయవాడ, నవంబర్ 5, :
ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి హవా కనిపించింది. కానీ అదే సమయంలో రెబల్స్ కూడా పార్టీలకు షాక్ ఇచ్చారు. టికెట్ రాలేదని వెనక్కి తగ్గలేదు. పార్టీ గుర్తు లేకుండానే స్వతంత్రులుగా పోటీ చేశారు. కొన్ని చోట్ల వార్డులు గెలిచారు. మరికొన్ని చోట్ల ఏకంగా చైర్‌పర్సన్ పీఠాలనే దక్కించుకున్నారు. విశాఖ నుంచి పిఠాపురం వరకు.. నెల్లిమర్ల నుంచి సాలూరు వరకు తమ సత్తా చూపించారు. కూటమి గెలుపు మధ్య రెబల్స్ విజయాలు ఇప్పుడు పార్టీల్లో చర్చగా మారాయి.విశాఖ ఎన్నికల్లో సుమారు 40 మంది రెబల్స్ స్వతంత్రులుగా పోటీ చేశారు. వీరిలో ఎనిమిది మంది గెలిచారు. 36, 39, 41, 73, 86, 98, 106, 118 వార్డులను స్వతంత్రులు కైవసం చేసుకున్నారు. వీరిలో కొందరు టీడీపీ, జనసేన టికెట్లు ఆశించి భంగపడిన నేతలే. కొన్ని చోట్ల ఒకే కూటమి నుంచి ఇద్దరు, ముగ్గురు రెబల్స్ పోటీకి దిగారు. దీంతో అధికారిక అభ్యర్థుల ఓట్లు చీలిందనే చర్చ జరిగింది. విశాఖలో కూటమి 120 వార్డులకు గాను 98 గెలిచినా.. రెబల్స్ గెలుపు మాత్రం నాయకులకు కొత్త తలనొప్పిగా మారింది.పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలోనూ ఇదే జరిగింది. అక్కడ చైర్‌పర్సన్ పీఠం జనసేనకు దక్కింది. కానీ పలు వార్డుల్లో స్వతంత్రులు గెలిచారు. పది మంది స్వతంత్రులు గెలిచారు. జనసేన, టీడీపీ, వైసీపీల్లో టికెట్ రాని అసంతృప్త నేతలు స్వతంత్రులుగా బరిలోకి దిగారు. అంటే పార్టీకి ఓటేస్తూనే.. తమకు నచ్చిన స్థానిక నాయకుడిని కూడా గెలిపించారన్న మాట.

నెల్లిమర్ల, సాలూరులో పీఠాలే సొంతం

రెబల్స్ ప్రభావం వార్డులకే పరిమితం కాలేదు. నెల్లిమర్లలో టీడీపీ టికెట్ ఆశించి భంగపడిన లంక అప్పలనాయుడు స్వతంత్రంగా పోటీ చేసి చైర్‌పర్సన్‌గా గెలిచారు. సాలూరులోటీడీపీ రెబల్ జి. అరుణ కూడా స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. కర్నూలు జిల్లా ఆదోనిలో జనసేన రెబల్ అధికారిక బీజేపీ అభ్యర్థిపై గెలిచారు. టికెట్ లేకపోయినా.. తమకున్న స్థానిక బలంతో ఈ నేతలు గెలవడం పార్టీలకు గట్టి సందేశమే.

రెబల్స్ వెనుక ఉన్న బలమేంటి

ఈ గెలుపుల వెనుక స్థానిక పరిచయాలు, ప్రజల్లో ఉన్న పేరు ప్రధానంగా కనిపిస్తున్నాయి. కొందరు ఏళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉన్నారు. స్థానిక సమస్యలపై పనిచేశారు. మరికొందరికి బలమైన అనుచరగణం ఉంది. టికెట్ రాకపోవడంతో అదే బలాన్ని నమ్ముకుని స్వతంత్రులుగా పోటీ చేశారు. కొన్ని చోట్ల కులం, కుటుంబం, వ్యాపార వర్గాల మద్దతు కూడా కలిసొచ్చి ఉండొచ్చు. పార్టీ గుర్తు కంటే అభ్యర్థి ఎవరు అన్నదానికే ఓటర్లు ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది. రాజకీయాల్లో ఓ మాట ఉంది. పార్టీ జెండా నీడనిస్తుంది. కానీ ఓటు మాత్రం వ్యక్తి వెంట నడుస్తుంది. ఈ ఎన్నికల్లో కొన్ని చోట్ల అదే జరిగింది. పార్టీలు తమకు నచ్చిన వారికి టికెట్లు ఇచ్చాయి. ఓటర్లు మాత్రం తమకు నచ్చిన వారిని గెలిపించారు. పాత నేతలను పక్కనపెట్టారా, కొత్తవారికి అవకాశం ఇచ్చారా, కుటుంబ సభ్యులకు టికెట్లు ఇచ్చారా అన్న చర్చ కూడా మొదలైంది.

కుటుంబాలు, వర్గాల మధ్య పోరు


కొన్ని చోట్ల టికెట్ల కేటాయింపుపై కుటుంబాలు, వర్గాల మధ్య అసంతృప్తి ఉందనే చర్చ జరుగుతోంది. ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టడం, స్థానికంగా బలమున్న వారికి టికెట్ ఇవ్వకపోవడం తిరుగుబాట్లకు కారణమై ఉండొచ్చు. కుటుంబాల మధ్య ఆధిపత్య పోరు కూడా కొన్ని చోట్ల ప్రభావం చూపి ఉండొచ్చు. అయితే ప్రతి రెబల్ గెలుపునకు ఇదే కారణమని చెప్పలేం. ఒక్కో చోట పరిస్థితి ఒక్కోలా ఉంటుంది.

ఇప్పుడు రెబల్స్ కింగ్‌మేకర్లా

గెలిచిన స్వతంత్రుల పాత్ర ఇప్పుడు కీలకం కానుంది. వీరు అధికార పార్టీలతో కలుస్తారా, స్వతంత్రంగానే ఉంటారా, మళ్లీ పాత పార్టీల్లో చేరతారా అన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీ అండ లేకుండా గెలిచిన వీరికి అభివృద్ధి పనులు చేయించుకోవడం కూడా సవాలే. గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే ఇప్పుడు అసలైన పరీక్ష.
పార్టీలకు గుణపాఠంఈ ఫలితాలు పార్టీ పెద్దలకు ఓ పాఠం చెబుతున్నాయి. టికెట్లు ఇచ్చేటప్పుడు నాయకుల సిఫార్సులు, పొత్తుల లెక్కలే కాదు. స్థానికంగా ఎవరికి ప్రజాబలం ఉందో కూడా చూడాలి. ప్రజల్లో పట్టున్న నేతలను పక్కనపెడితే.. వాళ్లే స్వతంత్రులుగా మారి పార్టీ అభ్యర్థులకు పోటీ ఇస్తారు. ఈ పరిణామాలు వచ్చే ఎన్నికల్లో టికెట్ల కేటాయింపుపై ప్రభావం చూపొచ్చు. వార్డుల్లో గెలిచిన నేతలు రేపు పెద్ద రాజకీయాల్లోకి రావాలని కూడా అనుకోవచ్చు.మొత్తానికి ఏపీ పురపోరులో కూటమి ఆధిపత్యం ఒకవైపు ఉంటే, రెబల్స్ విజయాలు మరోవైపు పార్టీలకు గట్టి సందేశం ఇచ్చాయి. విశాఖలో వార్డులు, పిఠాపురంలో స్థానాలు, నెల్లిమర్ల, సాలూరులో చైర్‌పర్సన్ పీఠాలు.. ఇలా తమ బలాన్ని చూపించారు. పార్టీలు టికెట్లు పంచాయి. ఓటర్లు మాత్రం తమ తీర్పు చెప్పారు. జెండా లేకపోయినా జనబలం ఉంటే గెలవొచ్చని రెబల్స్ నిరూపించారు. వీరి తిరుగుబాటు రాబోయే రోజుల్లో పార్టీల్లో ఇంకెన్ని మార్పులు తెస్తుందో చూడాలి.

అనంతలో తేడా ఎక్కడ కొట్టింది.. బాబు ఆరా.. !

టీడీపీకి కంచుకోటగా భావించే అనంతపురం కార్పొరేషన్‌లో వైసీపీ విజయం సాధించడంపై సీఎం చంద్రబాబు ఆరా తీసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలోని 13 కార్పొరేషన్లలో 12 చోట్ల కూటమి గెలవగా, అనంతపురంలో వైసీపీ అభ్యర్థి రమేష్ గౌడ్ మేయర్ పీఠం దక్కించుకోనున్నారు. బీజేపీకి కేటాయించిన ఈ స్థానంలో ఓటమికి కారణాలపై చంద్రబాబు నేతల నుంచి నివేదిక కోరినట్లు సమాచారం.
టీడీపీకి కంచుకోట వంటి అనంతపురంలో వైసీపీ విజయం దక్కించుకోవడం వింతగా ఉంది. నిజానికి రాష్ట్ర వ్యాప్తంగా 13 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగితే.. 12 చోట్ల కూటమి పార్టీలు విజయం దక్కించుకున్నారు. ముఖ్యంగా టీడీపీ, జనసేన పోటీ చేసిన కార్పొరేషన్లు, మునిసిపాలిటీలలో వందశాతం దక్కించుకున్నాయి. కానీ, అనంతపురం విషయానికి వస్తే.. ఇక్కడ వైసీపీ విజయం దక్కించుకుంది. దీంతో అసలు అక్కడ ఏం జరిగింది? అనే విషయం పై సీఎం చంద్రబాబు సీరియస్ అయినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అనంతపురం కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్, ఫలితాల సరళి, అక్కడ జరిగిన రాజకీయ ఘర్షణలు.. వంటివి రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు వచ్చాయి. కానీ, అనూహ్యంగా ఇక్కడ వైసీపీ విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి రమేష్ గౌడ్ మేయర్ పీఠం ఎక్కనున్నారు. అయితే.. వాస్తవానికి ఈ సీటును బీజేపీకి కేటాయించారు. దీంతో టీడీపీ వర్గాలు, జనసేన కార్యకర్తలను కలసి కట్టుగా బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కానీ, ఎన్నికల అనంతరం.. ఇక్కడ వైసీపీ గెలుపు గుర్రం



ఎక్కడంతో కూటమి నాయకులు ఆశ్చర్యానికి గురయ్యారు.
రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో కూటమి హవా నడుస్తున్నప్పటికీ, అనంతపురం కార్పొరేషన్ పరిధిలో మాత్రం వైసీపీ గెలవడం, అందునా.. కూటమికి గట్టి మద్దతు ఉన్న జిల్లాలో ఇలా జరగడం వంటి అంశాలపై చంద్రబాబు సీరియస్ అయినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల లెక్కింపులో రౌండ్ రౌండ్‌కు సమీకరణాలు మారుతుండం, వైసీపీ గట్టి పోటీ ఇవ్వడంతో, అసలు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందనే విషయంపై చంద్రబాబు పార్టీ నేతలను అడిగి తెలుసుకున్నారు.

నివేదిక వచ్చాక..

బీజేపీ విషయంలో చంద్రబాబు సానుకూల దృక్పథంతోనే ఉన్నారు. అయితే.. ఈ క్రమంలోనే బీజేపీ కోరిన స్థానాల తో పాటు.. టీడీపీనుంచి పూర్తిస్థాయిలో సహకారం కూడా అందించారు. అందుకే మునుపెన్నడూ లేని విధంగా బీజేపీ పుంజుకుంది. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే.. తాజాగా జరిగిన స్థానిక ఎన్నికల్లో కమలం మరింత వికసించింది. కానీ, కీలకమైన కార్పొరేషన్ స్థానంలో బీజేపీ ఓటమి.. అందునా 5 వేల పైచిలుకు ఓట్ల తేడాతో పరాజయం వంటివి చంద్రబాబును కూడా ఆలోచనలో పడేశాయి. దీంతో ఆయన స్థానికంగా టీడీపీ నేతలు ఎలా వ్యవహరించారు? ఏం చేశారు? అనే విషయాలపై నివేదిక కోరినట్టు పార్టీ నేతలు తెలిపారు. నివేదిక వచ్చాక.. తప్పులను సరిచేస్తారని.. అంటున్నారు.

కాంగ్రెస్‌కు షర్మిల అవసరముందా...జగన్‌ను టార్గెట్ చేయడమే రాజకీయమా ?

కాంగ్రెస్ పెద్దలు గమనిస్తున్నారో లేదో కానీ ఏపీలో కాంగ్రే పూర్తిగా వట్టిపోయింది. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులు పోటీ చేయడానికి ముందుకు వచ్చినా పట్టించుకునే వారే లేరని వాపోతున్న నేపథ్యం ఉంది. ఇక ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల పాత్ర గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అన్న భావన ఉంది. ఆమె స్థానిక ఎన్నికల వేళ కనీసం పార్టీ వైపు కన్నెత్తి చూడలేదు అన్న ఆరోపణలు ఉన్నాయి. ఎంతసేపూ ఆమె తన అన్న జగన్ ని విమర్శించేందుకే పరిమితం అవుతున్నారు అన్నది కూడా ఉంది. రాజకీయాలో రక్త సంబంధాలకు తావు లేదు, అయితే వైసీపీ అధినేతగా మాజీ సీఎం గా ఆయన్ని విమర్శించడం లేదు, సొంత వ్యవహారాల మీదనే ఆమె విమర్శలు చేస్తున్నారు అన్నది మాత్రం చర్చగా ఉంది.

ఆమె వల్ల లాభమేంటి :

రెండేళ్ల క్రితం ఏపీ కాంగ్రెస్ కి అధినేతగా షర్మిలను తీసుకుని వచ్చారు. ఈ క్రమంలో పార్టీకి ఏమైనా మేలు జరిగిందా అంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా ఉంది. వైఎస్సార్ కూతురు అన్న కారణంగానే ఆమెకు ఈ పదవి దక్కింది. కానీ ఆమె మాత్రం కాంగ్రెస్ ని ఏ విధంగానూ బలోపేతం చేయలేకపోయారు అన్నది నిశితమైన విమర్శగా ఉంది. ఆమె జగన్ ని టార్గెట్ చేస్తోంది. అది మీడియాలో వస్తోంది. ఆ హైప్ తోనే చాలు అనుకుంటే కాంగ్రెస్ పెద్దలు ఏపీ వైపు చూడాల్సిన అవసరం లేదని అంటున్నారు. ఎంతసేపూ వ్యక్తిగత విమర్శలకు ఆమె ప్రాధాన్యత ఇస్తారు అన్నది కూడా కాంగ్రెస్ లోనూ జనంలో ఉన్న భావనగా కనిపిస్తోంది.

ఎన్డీయేకు వ్యతిరేకంగా :

కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో ఎన్డీయేకు వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తోంది. మరి కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి ఊపిరి ఇస్తున్న టీడీపీ జనసేన బీజేపీ కూటమి మీద ఏపీలో కాంగ్రెస్ ఎంతలా పోరాడాలి. మచ్చుకైనా అది కనిపిస్తోందా అంటే లేనే లేదు అన్నదే జవాబుగా వస్తోంది. కాంగ్రెస్ అంటేనే దానికి ప్రత్యేకమైన రాజకీయ సిద్ధాంతం ఉంది. మరి దానికి ఏపీలో ఏ మేరకు షర్మిల తీసుకుని వెళ్తున్నారు అన్నది మరో ప్రశ్న. షర్మిల మాత్రం ఏపీలో కూటమి మీద విమర్శలు చేయడం కంటే జగన్ ని టార్గెట్ చేయడం మీదనే ఫోకస్ పెడుతున్నారు అని అంటున్నారు. నిజానికి జగన్, షర్మిల మధ్య వ్యక్తిగత కుటుంబ సంబంధిత వివాదాలు రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అవే ఇప్పుడు కాంగ్రెస్ వైపు నుంచి కూడా హైలెట్ అవుతున్నాయి. ఆ పార్టీ అజెండా అదే అన్నట్లుగా సెట్ చేసేశారు.

కాంగ్రెస్ పట్ల ప్రేమతోనా :

ఇక్కడ మరో ప్రశ్న కూడా ఉంది. షర్మిల కాంగ్రెస్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరారా లేక కుటుంబ విభేదాలతో అన్న జగన్ కి వ్యతిరేకంగా రాజకీయంగా ఎదుర్కోవాలని చేరారా అంటే దానికి ఆమె కాంగ్రెస్‌లో చేరడానికి ఆస్తుల వివాదమే కారణమని నిర్ధారించే ఆధారాలు బహిరంగంగా లేవు కానీ జరుగుతున్న పరిణామాలు కుటుంబ వివాదాలు, రాజకీయ విమర్శలు ఇవన్నీ జనంలో చర్చగా ఉన్నపుడు ఈ తరహా అనుమానాలు జనంలో వ్యక్తమవుతున్నాయి. షర్మిల జాతీయ పార్టీకి సంబంధించి ఏపీకి ఒక నాయకురాలు, కానీ ఆమె అసెంబ్లీలో లేదు, ఇక షర్మిల నాయకత్వంలో 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పోరాడింది. అపుడు కూడా ఒక్క అసెంబ్లీ స్థానాన్ని కూడా గెలుచుకోలేదు, అదే విధంగా పార్టీ ఓట్ల శాతం కూడా చాలా తక్కువ స్థాయిలోనే ఉందని అంటున్నారు. మరో వైపు షర్మిల స్వయంగా కడప లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆమెకు సుమారు 1.41 లక్షల ఓట్లు వచ్చాయి ఇక్కడ షర్మిల గెలుపు సాధించకపోయినా కాంగ్రెస్‌కు కొంత రాజకీయ చర్చను తీసుకురాగలిగారని అంటారు, ఆ మేరకు మాత్రమే సంతృప్తి పడాల్సి ఉంది.

పార్టీ నిర్మాణం ఏదీ :

వైసీపీలోకి కాంగ్రెస్ మొత్తం షిఫ్ట్ అయిపోగా అరకొరగా మిగిలిన పార్టీని పునర్నిర్మించే విధంగా షర్మిల ఏ మేరకు చర్యలు తీసుకున్నారు అన్నది ఇక్కడ ప్రశ్న. షర్మిల వల్ల కాంగ్రెస్ కి ఎంతో కొంత ప్రచారం వచ్చింది, అది మీడియాలోనే. కానీ గ్రాస్ రూట్ లో కాంగ్రెస్ అలాగే ఉంది అని అంటున్నారు. గ్రామాలలో ఈ రోజుకీ కాంగ్రెస్ కి ఎంతో కొంత ఓటు ఉంది, మరి దానిని పటిష్టం చేసే విధంగా యాక్షన్ ప్లాన్ ఉందా అనే లేదు అని జవాబు ఉంది. షర్మిల గతంలో రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేశారు, ఫలితాలు మాత్రం పెద్దగా లేవని అంటున్నారు. ఇక వచ్చే ఎన్నికలకు రెండేళ్ళ సమయం ఉంది. కాంగ్రెస్ కి పోటీ చేసేందుకు ఎంతమంది గట్టి అభ్యర్థులు ఉన్నారు అంటే కూడా సమాధానం లేదు.

కూటమి మీద ఉదాసీనత :

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు సాగాయి. ఎన్నో సమస్యలు ఏపీలో ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయాలు, ఎన్నికల హామీలు, ఉద్యోగాలు, పెట్టుబడులు, రైతుల సమస్యలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై ప్రతిపక్ష పార్టీలు నిరంతరం ప్రశ్నించాల్సి ఉంది. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకురాలిగా షర్మిల ఏమి చేస్తున్నారు అన్నది కూడా చర్చగా ఉంది. కూటమి మీద షర్మిల విమర్శలు తక్కువగా ఉన్నాయన్న భావన ఇక్కడే జనంలో ఏర్పడుతోంది. జాతీయ స్థాయిలో ఇండియా కూటమి ఎన్డీయేని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మరి ఏపీలో వామపక్షాలతో కలసి కాంగ్రెస్ కూటమిని గట్టిగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందా లేదా అంటే కూడా జవాబు వెతుక్కోవాల్సి వస్తోంది.

వాయుగంగంతో కుంభవృష్టి

విజయవాడ, నవంబర్ 5
తీవ్ర తుపాను మురసు తీరం దాటిన అనంతరం చూపించిన అసలు ప్రతాపం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దు జిల్లాలను అతలాకుతలం చేసింది. సాధారణంగా తుపాన్లు తీరం దాటిన తర్వాత బలహీనపడటం సహజమే అయినప్పటికీ, మురసు భూభాగంపైకి ప్రవేశించి తీవ్ర వాయుగుండంగా నెమ్మదిగా కదలడం వల్ల కుంభవృష్టిని కురిపించింది. ఆకాశానికి చిల్లు పడిందా అన్న రీతిలో గంటల వ్యవధిలోనే 20 నుంచి 27 సెంటీమీటర్లకు పైగా కుండపోత వర్షం నమోదైంది. తీర ప్రాంత జిల్లాలతో పాటు లోతట్టు ప్రాంతాలు అనూహ్య రీతిలో జలమయమై నదులు, వాగులు ఉగ్రరూపం దాల్చడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని నాలుగు కీలక జిల్లాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది.గుంటూరు, పల్నాడు, బాపట్ల బెల్ట్‌లో వర్ష తీవ్రత అల్లకల్లోలం సృష్టించింది. గుంటూరు నగరంలో ప్రధాన రహదారులు చెరువులను తలపించగా, సమీప గ్రామీణ ప్రాంతాల్లో నల్లమడ వాగు, నక్కవాగులకు గండ్లు పడి కాకుమాను, పెదనందిపాడు మండలాల్లోని గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. యడ్లపాడులో ఐదున్నర గంటల వ్యవధిలోనే ఏకంగా 26.8 సెంటీమీటర్ల వర్షపాతం కురిసి రికార్డు సృష్టించింది. రహదారులపై వెళ్లే వాహనాలు కొట్టుకుపోయేంత స్థాయిలో వరద పోటెత్తింది. గోడలు కూలి, వరద నీటిలో గల్లంతై నలుగురు ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతను చాటుతోంది. లక్షలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మిర్చి పైర్లు నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లింది.ఇక ఉమ్మడి కృష్ణా , ఏలూరు జిల్లాల్లోనూ వరద విలయం కొనసాగుతోంది. విజయవాడ పరిసర ప్రాంతాలతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని గంపలగూడెం, నందిగామ, తిరువూరు ప్రాంతాల్లో కట్టలేరు, వైరా నదులు ప్రమాదకర స్థాయికి మించి పొంగి ప్రవహిస్తున్నాయి. దాములూరు కాజ్‌వే, తోటమూల వద్ద రోడ్లు కొట్టుకుపోవడంతో దాదాపు 20కి పైగా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఏలూరు నగరంలో లోతట్టు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకోగా, పశ్చిమ గోదావరి, ఏలూరు సరిహద్దుల్లోని పంట కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ప్రకాశం బ్యారేజీ వద్దకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతుండటంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.మరోవైపు తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలపై ఈ తుపాను ప్రభావం పెను విలయాన్ని మిగిల్చింది. అశ్వారావుపేట మండలంలో అత్యధికంగా 27.6 సెంటీమీటర్లు, దమ్మపేట, ములకలపల్లి మండలాల్లో 20 సెంటీమీటర్లకు పైగా కురిసిన వర్షానికి చెరువులు, వాగులు కట్టలు తెంచుకున్నాయి. పాల్వంచ-దమ్మపేట ప్రధాన మార్గంలో తాత్కాలిక అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో భారీగా రాకపోకలు స్తంభించాయి. వైరా జలాశయం నిండుకుండలా మారగా, మల్లెపూల వాగు ముంచెత్తడంతో వేలాది ఎకరాల పంట పొలాలు నీటమునిగాయి. సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలిగింది. సత్తుపల్లి వల్ల చెరువులో చిక్కుకున్న వారిని కాపాడటానికి వెళ్లి ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందే గల్లంతయ్యారు.

పరిషత్ ఎన్నికల పోలింగ్‌లో కడప జిల్లాలో తీవ్ర ఉద్రిక్తత

కడప: పరిషత్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కడప జిల్లాలో పలుచోట్ల తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పులివెందుల నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీంతో పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. పులివెందుల సమీపంలోని పార్నపల్లిలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి తన అనుచరులతో కలిసి పోలింగ్ కేంద్రానికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఎంపీకి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా అవినాశ్ రెడ్డి మాట్లాడుతూ... పెద్ద సంఖ్యలో బయటి వ్యక్తులు జిల్లాలోకి చొరబడ్డారని... రాళ్లు, కర్రలతో తిరుగుతూ వైసీపీ ఏజెంట్లను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే ఇదంతా జరుగుతోందని, తమ పార్టీ నేతలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, ఆర్ తుమ్మలపల్లిలో టీడీపీ, వైసీపీ వర్గీయులు రాళ్లు, సోడా బాటిళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. పెద్దముడియం మండలం గుండ్లకుంటలో రెండు పోలింగ్ కేంద్రాల నుంచి టీడీపీ ఏజెంట్లను వైసీపీ నేతలు బయటకు పంపించగా, పోలీసులు కల్పించుకుని వారిని తిరిగి లోపలికి పంపించారు. ఈ వరుస ఘటనల నేపథ్యంలో ఉద్రిక్త ప్రాంతాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

94 శాతం స్ట్రైక్‌రేట్‌ను దాటాలి

రాష్ట్రంలో జరుగుతున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలను మించి, పరిషత్ ఎన్నికల్లో అద్భుత విజయం సాధించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. బుధవారం మూడు పార్టీల ముఖ్య నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. స్థానిక స్థాయిలో ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే వాటిని పక్కనపెట్టి, కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చంద్రబాబు సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు, సుపరిపాలనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, మనం ప్రజలకు అండగా నిలిస్తే వారూ మనకు తోడుంటారని పేర్కొన్నారు. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా నేడు పరిషత్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. మొత్తం 7,770 ఎంపీటీసీ, 582 జెడ్పీటీసీ స్థానాలకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 7వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ నేత పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీలో వాచ్‌మెన్ అనుమానాస్పద మృతి

రేకుల షెడ్‌లో లభ్యమైన లక్ష్మీనారాయణ మృతదేహం

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బెరువాడ సమీపంలోని కాకతీయ గ్రానైట్ క్వారీలో వాచ్‌మెన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. క్వారీలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న దారం లక్ష్మీనారాయణ (60) మృతదేహం క్వారీలోని ఓ రేకుల షెడ్‌లో లభ్యమైంది. విధుల్లో ఉన్న సమయంలోనే మృతి చెందడంతో ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. అయితే ఆయన మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. పోలీసుల విచారణ అనంతరం మృతికి గల కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఏపీ పరిషత్ ఎన్నికల్లో ఓటు వేసిన బోయపాటి శ్రీను

గుంటూరు: ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీను ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుంటూరు జిల్లాలోని తన స్వగ్రామం పెదకాకానిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. సాధారణ పౌరుడిలాగే క్యూలో నిల్చొని తన వంతు వచ్చినప్పుడు ఓటు వేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న కొద్దిమంది అభిమానులు, స్థానికులతో ఆయన మాట్లాడారు. ప్రతి ఎన్నికల్లోనూ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా సామాన్య ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తుంటారు. అందులో భాగంగానే బోయపాటి శ్రీను కూడా తన స్వస్థలంలో ఓటు వేసి తన పౌర బాధ్యతను నెరవేర్చారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

డేటింగ్ నుంచి వివాహం వరకు.. నేటి యువత మైండ్‌సెట్‌పై ప్రభుత్వం ఫోకస్!



పెరుగుతున్న విడాకుల కేసులను తగ్గించేందుకు గోవా ప్రభుత్వం వినూత్న కోర్సును ప్రారంభిస్తోంది. కాలేజ్ ఆఫ్ హోమ్ సైన్సెస్ ఆధ్వర్యంలో డిసెంబర్ 2 నుంచి 15-20 రోజుల ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నారు. డేటింగ్, లివ్-ఇన్, వివాహ బంధాల మధ్య తేడాలు, సంబంధాల్లో బాధ్యతలు, సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించనున్నారు. 18 ఏళ్లు నిండినవారు ఈ కోర్సులో చేరవచ్చు. పూర్తి చేసిన వారికి ప్రభుత్వ సర్టిఫికెట్ అందజేయనున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి యువత జీవనశైలి, ఆలోచనా విధానం వేగంగా మారిపోతున్నాయి. ఒకప్పుడు పెళ్లి అంటే నూరేళ్ల పంట అనుకునే పరిస్థితి పోయి, ఇప్పుడు డేటింగ్, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఆధునిక గందరగోళం మధ్య పెరిగే విడాకుల శాతాన్ని తగ్గించేందుకు గోవా ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా ఒక వినూత్న కోర్సును తీసుకొచ్చింది. ఈ సరికొత్త ప్రయత్నం వెనుక ఉన్న అసలు వ్యూహం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

మారుతున్న లైఫ్‌స్టైల్.. గందరగోళంలో యువత:

ప్రస్తుత జనరేషన్‌లో ప్రేమ, డేటింగ్, లివ్-ఇన్ రిలేషన్‌షిప్ మరియు సాంప్రదాయ వివాహం మధ్య తేడాలను సరిగ్గా అర్థం చేసుకోలేక చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఆధునికత పేరుతో బంధాలకు ఇస్తున్న ప్రాధాన్యత మారుతుండటంతో, చిన్న చిన్న మనస్పర్థలకే బంధాలు తెగిపోతున్నాయి. నేటి యువత ఎదుర్కొంటున్న ఈ మానసిక గందరగోళానికి సరైన దిశ నిర్దేశం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వమే రంగంలోకి దిగి కౌన్సెలింగ్:

కేవలం ప్రైవేట్ సంస్థలకే పరిమితం కాకుండా, గోవా ప్రభుత్వంలోని 'కాలేజ్ ఆఫ్ హోమ్ సైన్సెస్' అధికారికంగా 15 నుంచి 20 రోజుల ఆన్‌లైన్ కోర్సును డిసెంబర్ 2 నుంచి ప్రారంభిస్తోంది. ఇక డేటింగ్‌కు, పెళ్లికి మధ్య ఉన్న సున్నితమైన వ్యత్యాసాలు ఏమిటి? రిలేషన్‌షిప్‌లో బాధ్యతలు ఎలా పంచుకోవాలి? అనే అంశాలపై నిపుణులతో శిక్షణ ఇప్పించనున్నారు. ఈ కోర్సు ద్వారా యువత మైండ్‌సెట్‌లో సానుకూల మార్పు తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.

పెరుగుతున్న విడాకులకు చెక్ పెట్టే ప్రయత్నం:

గోవాలో గత కొద్ది సంవత్సరాలుగా సివిల్ కోర్టుల్లో విడాకుల కేసులు భారీగా పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. అందుకే వివాహ బంధాన్ని పదిలంగా ఉంచడానికి, భార్యాభర్తల మధ్య అవగాహన పెంచడానికి ఈ ప్రత్యేక కోర్సును డిజైన్ చేశారు. ముఖ్యంగా వర్కింగ్ కపుల్స్ ఎదుర్కొనే ఈగో సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో ఇందులో వివరిస్తారు. ఇక 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ కోర్సుకు అర్హులు కావడం విశేషం.

ప్రభుత్వ రాజముద్రతో సర్టిఫికెట్;

ఈ స్వల్పకాలిక కోర్సు పూర్తి చేసిన వారికి గోవా ప్రభుత్వం అధికారిక రాజముద్రతో కూడిన సర్టిఫికెట్ అందజేస్తుంది. ఇది కేవలం సర్టిఫికెట్ మాత్రమే కాకుండా, భవిష్యత్తులో కుటుంబ వ్యవస్థను నిలబెట్టే ఒక విలువైన పాఠంలా పనిచేస్తుంది. ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉండటంతో దేశంలోని ఏ మూలన ఉన్న యువతయినా సులభంగా ఇందులో చేరవచ్చు.

బంధాలను కాపాడుకునే అడుగు:

ఆధునిక పోకడలను పూర్తిగా తప్పుపట్టకుండా, వాటి మధ్య ఉన్న వాస్తవాలను యువతకు అర్థం అయ్యేలా చెప్పడం ఈ కోర్సు ప్రత్యేకత. పెళ్లి అనేది కేవలం ఒక బంధం మాత్రమే కాదు, జీవితాంతం కలిసి నడిచే ప్రయాణం అనే స్పష్టతను ఇది ఇస్తుంది. ఇక గోవా ప్రభుత్వం తీసుకున్న ఈ అద్భుతమైన చొరవ, నేటి తరం రిలేషన్‌షిప్‌లకు ఒక చక్కటి మార్గదర్శిగా మారుతుందనడంలో సందేహం లేదు.

వ్యాపారంలోనూ కోహ్లీ కింగ్.. రూ. 1,600 కోట్ల సామ్రాజ్యం వెనుక అసలు కథ ఇది

టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ క్రికెట్‌తో పాటు వ్యాపార రంగంలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ప్రస్తుతం ఆయన సంపద సుమారు రూ.1,600 కోట్లుగా అంచనా వేస్తున్నారు. ఐపీఎల్ పారితోషికం, బీసీసీఐ కాంట్రాక్ట్, అంతర్జాతీయ బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, సోషల్ మీడియా ప్రమోషన్ల ద్వారా భారీ ఆదాయం పొందుతున్నారు. వీటితో పాటు ఫిట్‌నెస్, రెస్టారెంట్లు, దుస్తుల బ్రాండ్లు, స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టారు. 38వ ఏట అడుగుపెడుతున్న కోహ్లీ ప్రయాణం క్రీడా విజయాలతో పాటు ఆర్థికంగా ఎదగాలనుకునే వారికి స్ఫూర్తిగా నిలుస్తోంది. భారత క్రికెట్‌లో విరాట్ కోహ్లీ పేరు ఒక సంచలనం. మైదానంలో దిగితే చాలు.. తన ఆవేశపూరితమైన ఆటతీరుతో.. శతకాల పరంపరతో పరుగుల వర్షం కురిపించే ఈ రారాజు సంపాదనలోనూ అదే స్థాయి దూకుడును ప్రదర్శిస్తున్నారు. ఒకప్పుడు ఢిల్లీ వీధుల్లో సాధారణ కలలతో కెరీర్ ప్రారంభించి భారత జట్టులో చోటే లక్ష్యంగా అడుగుపెట్టిన ఈ స్టార్ క్రికెటర్.. నేడు ప్రపంచంలోనే అధిక సంపద కలిగిన క్రీడాకారుల జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. కేవలం బ్యాట్‌తో సాధించిన విజయాలు మాత్రమే కాకుండా అసాధారణమైన బ్రాండ్ వ్యాల్యూ వ్యూహాత్మక వ్యాపార పెట్టుబడులు... సోషల్ మీడియా ప్రభావంతో సుమారు రూ. 1,600 కోట్ల భారీ ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు.

విరాట్ కోహ్లీకి క్రికెట్ రూపంలో వస్తున్న ఆదాయం ఎంతో ఎక్కువ. ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ తరఫున ఆడుతున్న ఆయనకు ప్రతి సంవత్సరం సుమారు రూ. 21 కోట్ల పారితోషికం లభిస్తోంది. దీనికి తోడు భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇచ్చే ఏ-ప్లస్ (ూ+) గ్రేడ్ వార్షిక కాంట్రాక్టు ద్వారా రూ. 3 కోట్లతో పాటు ప్రతి మ్యాచ్ ఫీజులు..ఇతర క్రీడా సంబంధిత ప్రోత్సాహకాలు విడివిడిగా అందుతున్నాయి. అయితే ఇది ఆయన నిర్మించిన సంపద కొండలో ఒక భాగం మాత్రమే.డిజిటల్ ప్రపంచంలో విరాట్ కోహ్లీకున్న క్రేజ్.. గ్లోబల్ రీచ్ అసాధారణమైనవి. సోషల్ మీడియాలో కోట్ల సంఖ్యలో ఉన్న ఆయన అభిమానుల నెట్‌వర్క్ అంతర్జాతీయ బ్రాండ్లను ఎంతగానో ఆకర్షిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో ఆయన చేసే ఒక్క ప్రమోషనల్ , స్పాన్సర్డ్ పోస్ట్ విలువ కోట్లలో ఉంటుంది. మైదానంలో ఆయన నిలబెట్టుకున్న విశ్వసనీయత.. ఫిట్‌నెస్ క్రమశిక్షణ.. యువతపై ఆయనకున్న ప్రభావం వల్ల ప్రతి ప్రముఖ కంపెనీ తమ ఉత్పత్తులకు విరాట్‌నే బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంచుకోవడానికి ఎంతో ఆసక్తి చూపిస్తున్నాయి.కోహ్లీ విజయ రహస్యం కేవలం క్రికెట్‌కే పరిమితం కాలేదు. తన ఇష్టాఇష్టాలను, ఫిట్‌నెస్ పట్ల ఉన్న శ్రద్ధను వ్యాపార అవకాశాలుగా మలుచుకోవడంలో ఆయన సఫలీకృతులయ్యారు. స్వయంగా ఫిట్‌నెస్ ఐకాన్ అయిన కోహ్లీ, జిమ్‌లు, ఫిట్‌నెస్ ఉత్పత్తుల వ్యాపారంలో భారీగా పెట్టుబడులు పెట్టారు. తన అభిరుచికి తగ్గట్టుగా ప్రీమియం రెస్టారెంట్లు , డైనింగ్ నెట్‌వర్క్‌లను నెలకొల్పారు. స్వంత దుస్తుల బ్రాండ్లు , వివిధ క్రీడా ఫ్రాంచైజీలు, స్టార్టప్‌లలో భాగస్వామిగా మారి వ్యాపారాల్లో ముందంజలో ఉన్నారు.ఈ రోజు 38వ వసంతంలోకి అడుగుపెడుతున్న విరాట్ కోహ్లీ ప్రయాణం ప్రతి ఒక్కరికీ ఎంతో స్ఫూర్తిదాయకం. ప్రతిభ ఒక్కటే ఉంటే సరిపోదని.. దానికి నిరంతర సాధన, క్రమశిక్షణ, కఠినమైన శ్రమ, లభించిన అవకాశాలను సరైన రీతిలో ఆర్థికంగా మార్చుకునే వ్యూహాత్మక ఆలోచన తోడైతే ఎంతటి ఎత్తులైనా ఎదుగొచ్చని ఆయన నిరూపించారు.క్రికెట్ మైదానంలో సెంచరీల రికార్డులను తిరగరాసిన కోహ్లీ ఆర్థిక రంగాన కూడా రూ. 1,600 కోట్ల సంపాదనతో తన బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేశారు.

క్రెడిట్ ఎంపీ భరత్ కేనా ?



ఏపీలోనే అతిపెద్ద కార్పొరేషన్ జీవీఎంసీని కూటమి భారీ మెజారిటీతో కైవసం చేసుకుంది. 120 వార్డులకు గాను 106 వార్డుల్లో కూటమి అధిక్యం సాధించింది. మేయర్ అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం, వార్డుల సమన్వయం వరకు విశాఖ ఎంపీ శ్రీభరత్ కీలక పాత్ర పోషించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తూర్పు కాపు సామాజిక సమీకరణాలను ఏపీలోనే అతి పెద్ద కార్పొరేషన్ కూటమి ఖాతాలో పడింది. అది కూడా దాదాపుగా రెండున్నర లక్షల ఓట్ల భారీ మెజారిటీతో. ఒకసారి మాత్రమే కార్పొరేటర్ గా పనిచేసిన అనుభవం ఉన్న ఒక నాయకురాలిని తెచ్చి ఏకంగా జీవీఎంసీ పీఠం మీద కూర్చోబెట్టడం అంటే టీడీపీకే అది చెల్లింది. అయితే ఆమె అభ్యర్థిత్వాన్ని గుర్తించి ఎంపిక చేయడం సామాజిక రాజకీయ సమీకరణలను అన్నీ పడపోసి గెలుపుని ముందే ఊహించి ఖరారు చేయడంతో విశాఖ ఎంపీ శ్రీ భరత్ పాత్ర కీలకంగా ఉంది అని అంటున్నారు. ఇక్కడే వైసీపీ ఎత్తుకు పై ఎత్తు ఎంపీ వేశారు అని అంటున్నారు.

ఆ సామాజిక వర్గం పైన :

విశాఖ జనరల్ మహిళకు రిజర్వ్ అయింది. దాంతో అనేక మంది బిగ్ షాట్స్ వారసుల పేరులు వినిపించాయి. ఒక దశలో అయితే డజన్ కి పైగా పేర్లు విన వచ్చాయి. అందులో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఇలా ఎంతో మంది మేయర్ పీఠం కోసం కర్చీఫ్ వేసిన నేపథ్యం ఉంది. ఇక ఇదే సమయంలో కూటమికి దెబ్బ తీయాలని వైసీపీ ఒక ఎత్తు వేసింది. అదే బీసీ కార్డు. బీసీ మహిళకు టికెట్ ఇవ్వడం ద్వారా కూటమి ఓసీకి చాన్స్ ఇస్తే దాన్ని ఎండగడుతూ తమ రాజకీయాన్ని పండించుకోవాలని అనుకుంది. అక్కడే ఎంపీ శ్రీభరత్ పై ఎత్తు వేశారు అని అంటున్నారు. బీసీల పార్టీగా ముద్ర ఉన్న టీడీపీ ఆ బ్రాండ్ ఇమేజ్ ని కాపాడుకుంటూనే బీసీలలో తూర్పు కాపులకు అవకాశం కల్పించడం ద్వారా వైసీపీ బీసీ అస్త్రాన్ని తిప్పి కొట్టగలిగారు అని అంటున్నారు. జీవీఎంసీ పరిధిలో తూర్పు కాపులు హెచ్చు సంఖ్యలో ఉన్నారు. దాంతో పాటు ఓసీ కాపులు కూడా ఆ వైపుగా టర్న్ అయ్యారు. ఇవన్నీ కలసి సామాజిక పరమైన సమీకరణలను కూటమికి పూర్తి స్థాయిలో అనుకూలంగా మార్చేశాయి అని అంటున్నారు.

వన్ మ్యాన్ షో గానే :

ఇక జీవీఎంసీ పరిధిలో ఎంతో మంది దిగ్గజ నేతలు ఉన్నా భరత్ అంతా తానై మేయర్ ఎన్నికల్లో ముఖ్య భూమిక పోషించారు అని అంటున్నారు. ఆయన అభ్యర్థి ఎంపికలో కీలక పాత్ర నుంచి ప్రచారం నుంచి వార్డుల్లో అభ్యర్థుల ఎంపిక కూటమితో కో ఆర్డినేషన్ ఇలా అన్నీ చూసుకోవడం ద్వారానే ఇంతటి విజయం దక్కించగలిగారు అంటున్నారు. ఈ రోజున జీవీఎంసీలో 120 వార్డులు ఉంటే 14 వార్డులు తప్పించి 106 వార్డులలో కూటమి కనిపిస్తుంది. అంతలా కూటమికి ఘన విజయం దక్కడం వెనక యువ ఎంపీ వ్యూహాలే ఉన్నాయని అంటున్నారు. దాంతో ఆయనకు ఈ ఎన్నికలలో విజయం తరువాత అధినాయకత్వం వద్ద మరింతగా పేరు వచ్చిందని చెబుతున్నారు. గతంలో శ్రీ భరత్ తాత మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి కూడా విశాఖ రాజకీయాల్లో బలమైన ముద్ర వేశారు. ఇపుడు అదే ఒరవడిని శ్రీ భరత్ కొనసాగిస్తున్నారు అని అంటున్నారు. గడచిన రెండున్నరేళ్ళుగా విశాఖ జిల్లాకు మంత్రి లేకపోయినా ఎంపీ తనదైన శైలిలో స్థానికంగా పట్టు సాధించారని గుర్తు చేస్తున్నారు. ఇదే తీరున ఆయన ముందుకు సాగితే సుదీర్ఘ కాలం పాటు తన పలుకుబడిని కొనసాగిన్నారని అంటున్నారు. ఇక ఈ విజయంతో 2029 లో విశాఖ జిల్లా పూర్తి బాధ్యతలు భరత్ మీదనే పెడతారు అని కూడా వినిపిస్తున్న మాట.

కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు పరీక్ష



తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయాలు ఇప్పుడు కాకరేపుతున్నాయి.. అధికారం చేతికి రాగానే నేతలందరూ కలసికట్టుగా ప్రజలకు పాలన అందిస్తారేమో అని అమాయకంగా ఆశించిన అంతర్గత తగాదాలతో అగ్గిరాజేస్తున్నారు.. కాంగ్రెస్ నేతలు ఓపెన్ గానే బరెస్ట్ అవుతూ నిప్పు రాజేస్తున్నారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు "సమైక్యంగా పోరాడుదాం" అని భుజం భుజం కలిపి నినదించిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు.. తీరా అధికార పీఠం దక్కేసరికి.. "పోరాటం ఆగదు.. కాకపోతే ఈసారి మనోళ్లతోనే" అంటూ సొంత పార్టీలోనే రంగుల రచ్చ మొదలుపెట్టారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు.. ఒకరా ఇద్దరా? ఒకరిపై ఒకరు విమర్శల బాణాలు.. వ్యంగ్యాస్త్రాలు.. సెటైరికల్ లేఖలతో వార్తల్లో నిలుస్తూ సగటు ఓటరుకి కావాల్సినంత ఉచిత వినోదాన్ని పంచుతున్నారు.మంత్రి దామోదర రాజనర్సింహకు, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుకు పడదు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి లు అయితే బహిరంగంగానే డైలాగ్ వార్ నడుపుతున్నారు. ఇక ఎంపీ వంశీకృష్ణ ది మరో లొల్లి. ఆయన ఏకంగా మంత్రి శ్రీధర్ బాబుకే ఒక 'చమత్కారపు లేఖ' రాసి తమలోని సృజనాత్మకతను చాటుకున్నారు. అంతర్గత సమావేశాల్లో తేల్చుకోవాల్సిన ముచ్చట్లను మీడియా ముందుకు తెచ్చి మైకుల ముందు రచ్చ చేయడమే అసలైన 'కాంగ్రెస్ మార్క్' క్రమశిక్షణ అని నిరూపిస్తున్నారు.ఈ పంచాయితీలన్నీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కి పెద్ద తలనొప్పిగా మారాయి. దీంతో ఆయన 'గాంధీ భవన్'ను అసలైన పంచాయితీ రచ్చబండగా మార్చేశారు. విభేదాలున్న నేతలకు గాంధీ భవన్ టీ, బిస్కట్ల ఆతిథ్యం ఇచ్చి.. "కొంచెం తగ్గించుకోండి బాస్" అని క్లాస్ పీకేందుకు ప్లాన్ చేశారు. అయితే అసమ్మతి మహావృక్షాలను టీకప్పులలో సర్దిచెప్పడం సాధ్యమేనా అన్నదే ఇక్కడ అసలైన ట్విస్ట్..అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కన్నా "ఎవరి హవా ఎంత?" అని నిరూపించుకోవడానికే నేతలకు సమయం సరిపోవడం లేదు. పీసీసీ చీఫ్ పిలిపించి మాట్లాడితే ఈ 'స్నేహపూర్వక పోరాటాలు' ఆగుతాయా? లేక గాంధీ భవన్ గుమ్మం దాటగానే మళ్ళీ పాత పాట అందుకుంటారా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రతిపక్షాలకు కష్టపడే పనిలేకుండా తమకు తామే వినోదాన్ని అందిస్తున్న కాంగ్రెస్ క్రమశిక్షణ పరీక్షలో పాస్ అవుతుందో... లేక సొంత నేతల సెటైర్లకే బలైపోతుందో కాలమే సమాధానం చెప్పాలి..

చీప్.. వెరీ చీప్..పాకిస్తాన్ లో బంగారం ఎంత తక్కువనో తెలుసా?



చీప్.. వెరీ చీప్.. పాకిస్తాన్‌లో బంగారం తులం రూపాయిల లెక్క చూస్తే సగం ఉచితంగా ఇస్తున్నట్లే అనిపిస్తోంది కదూ? "అరే.. దేశం ఆర్థిక సంక్షోభంలో మునిగిపోతుంటే నిత్యావసరాల ధరలు చుక్కలనంటుతుంటే పెట్రోల్ లీటర్ రూ. 390 దాటేసి సామాన్యుడి జేబుకు కన్నం పెడుతుంటే... ఈ బంగారం మాత్రం ఇంత సరసంగా ఎలా దొరుకుతోంది సామీ?" అని ఆశ్చర్యపోవడం మీ వంతు అవుతుంది. భారత్‌తో పోలిస్తే ఏకంగా తులంపై రూ. 21 వేలకు పైగా తేడా ఉందంటే... విమానం టికెట్ బుక్ చేసుకుని కరాచీ వెళ్ళి నాలుగు తులాల బంగారం కొనుక్కొద్దామా అని ప్లాన్ వేస్తున్నారేమో.. ఆగండి.. అంత తొందరపడి కరాచీ ఫ్లైట్ ఎక్కేయకండి.. అసలు కథ ముందర ఉంది.

నవంబర్ 4 నాటి మార్కెట్ వివరాలు చూస్తే.. 24 క్యారెట్ల తులం బంగారం ధర పాకిస్తాన్‌లో భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ. 1,21,654గా ఉంటే మన భారతదేశంలో అది రూ. 1,43,105 పలుకుతోంది. అంటే వ్యత్యాసం అక్షరాలా రూ. 21,451.. ఇక 22 క్యారెట్ల విషయానికొస్తే అక్కడ రూ. 1,11,516, ఇక్కడ రూ. 1,31,742.. బాబోయ్, ఎంత తేడా.. కానీ ఇక్కడే ఒక చిన్న వింత ఉంది. పాకిస్తానీ రూపాయి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో ఎంత పడిపోయిందో తెలిస్తే మీ కళ్ళు తిరగడం ఖాయం. మనం చెల్లించే ఒక భారత రూపాయికి.. వారి దేశంలో దాదాపు మూడు పాకిస్తానీ రూపాయలు వస్తాయి.. అంటే అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర డాలర్లలో నిర్ణయించ బడినప్పుడు దాన్ని స్థానిక కరెన్సీలోకి మార్చి తిరిగి మన రూపాయిలోకి మారిస్తే వచ్చే ఈ 'మాయాజాలపు తేడా' చూసి జనాలు మోసపోతున్నారు.పాకిస్థాన్‌లో బంగారం కొనేసి ఇండియాకు తేవడం చాలా ఈజీ అనుకుంటే పప్పులో కాలేసినట్లే. మన దేశంలో బంగారంపై 3 శాతం జీఎస్టీ.. పక్కా మేకింగ్ ఛార్జీలు ఉంటాయి. సరే సరిహద్దు దాటి అక్కడ కొందామన్నా కస్టమ్స్ అధికారుల పహారా.. పన్నుల మోత మిమ్మల్ని సరిహద్దులోనే పలకరిస్తాయి. మన దేశ రూపాయి బలం ముందు పాకిస్తానీ రూపాయి తేలిపోవడం వల్ల వచ్చే వ్యత్యాసమే తప్ప బంగారం అక్కడ చౌక కాదు. విదేశాల నుండి ఉచితంగానో లేక తక్కువ ధరకో బంగారం తేద్దామంటే కస్టమ్స్ చట్టాలు ఊరుకోవు. అక్కడ లీటరు పాలు, పెట్రోల్ కొనేందుకే సామాన్యుడు అల్లాడుతుంటే బంగారం కొనేంత సీన్ స్థానిక పాకిస్తానీయులకు ఎక్కడిది? కాబట్టి "పాకిస్తాన్‌లో బంగారం చీప్" అనే మాట కేవలం కాగితపు లెక్కల విన్యాసమే తప్ప నిజంగా అక్కడ లభ్ది పొందే అవకాశమే లేదు. వార్తల్లో కనిపించే ఆంకెలు చూసి మురిసిపోవడం కన్నా మన ఊరి జ్యువెలరీ షాప్‌లోనే బంగారం కొనుక్కోవడం సర్వత్రా శ్రేయస్కరం.

ఇదే ఫస్ట్ టైమ్.. వరల్డ్ టాప్ 50లో చోటు దక్కించుకున్న రెండు ఇండియన్ రెస్టారెంట్లు !

ప్రపంచంలోనే 50 బెస్ట్ రెస్టారెంట్ల జాబితాలో ఇండియాకు చెందిన రెండు రెస్టారెంట్లు చోటు దక్కించుకున్నాయి. మిషెలిన్ గైడ్ గా భావించే అత్యంత ప్రతిష్టాత్మకమైన లిస్టులో చోటు సంపాదించడం భారతీయ వంటకాలకు, దేశీయ రెస్టారెంట్లకు దక్కిన పెద్ద గౌరవంగా భావిస్తున్నారు. రెండు రెస్టారెంట్లతో పాటు టాప్ హోటల్స్ గురించి తెలుసుకుందాం.



పెరూలోని లిమాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2026 బెస్ట్ రెస్టారెంట్స్ ర్యాంకింగ్స్ ను విడుదల చేశారు. ఈ ఏడాది అత్యుత్తమ రెస్టారెంట్‌గా స్పెయిన్‌లోని అసడోర్ ఎట్చెబర్రి సెలెక్ట్ అయ్యింది. స్పెయిన్ బాస్క్ ప్రాంతంలోని చిన్న గ్రామంలో ఉన్న ఈ రెస్టారెంట్‌లో చెఫ్ బిట్టర్ అర్గుయింజోనిజ్ అందించే గ్రిల్-ఆధారిత వంటకాలు ఫేమస్. ఇండియా నుంచి ఎంపికైన వాటిలో ముంబైకి చెందిన మాస్క్ చోటు దక్కించుకుంది. మాస్క్ రెస్టారెంట్ కు 26వ స్థానం దక్కింది. చెఫ్ వరుణ్ తోట్లాని నేతృత్వంలో నడుస్తున్న ఈ రెస్టారెంట్ ఫస్ట్ టైమ్ ఈ లిస్టులో చోటు సంపాదించింది.

ముంబై మహాలక్ష్మి ప్రాంతంలోని పాత టెక్స్‌టైల్ మిల్లులో ఉంటుంది ఈ రెస్టారెంట్. సాంప్రదాయ భారతీయ వంటకాలను కొత్తగా, ట్రెండుకు తగినట్లు, ఆసక్తికరంగా అందించడం దీని స్పెషల్.

నార్ :

ఇండియా నుంచి ఎంపికైన మరో రెస్టారెంట్ నార్. దీనికి 49వ స్థానం దక్కింది. చెఫ్ ప్రతీక్ సాధు నడుపుతున్న ఈ రెస్టారెంట్ హిమాలయాల పాదాల దగ్గర ఉంటుంది. స్థానిక పదార్థాలు, సీజనల్ మెనూ, పర్యావరణ అనుకూల వంటల శైలికి గుర్తింపుగా సస్టైనబుల్ రెస్టారెంట్ అవార్డు 2026 కూడా అందుకుంది. ఛండీగఢ్ నుంచి 90 నిమిషాల ప్రయాణంతో హిమాలయాల దగ్గర ఉన్న ఈ రెస్టారెంటును చేరుకోచ్చు.

లిస్టులోని మరికొన్ని ముఖ్యమైన రెస్టారెంట్లు:

బ్యాంకాక్‌లోని గగ్గన్ రెస్టారెంట్ లిస్టులో 2వ స్థానంలో నిలిచింది. కోల్‌కతా కు చెందిన చెఫ్ గగ్గన్ ఆనంద్ నడుపుతున్న ఈ రెస్టారెంట్ ఆసియాలోని బెస్ట్ రెస్టారెంట్ 2026 బిరుదు అందుకోవడం గమనార్హం. దుబాయ్‌లోని ట్రెసిండ్ స్టూడియో 28వ స్థానం సంపాదించుకుంది. చెఫ్ హిమాంశు సైనీ నేతృత్వంలోని ఈ రెస్టారెంట్‌కు మధ్యప్రాచ్యంలోని ఉత్తమ రెస్టారెంట్ అవార్డు దక్కింది. గతంలో ఈ లిస్టులో 2004లో మొదటి సారి ఒకే రెస్టారెంట్ చోటు దక్కించుకుంది. అది ఢిల్లీలోని బుఖారా రెస్టారెంట్. అయితే ఈసారి భారత్‌లోని రెండు రెస్టారెంట్లు ఒకేసారి చోటు సంపాదించడం చారిత్రక విశేషం.

దగ్గుబాటి మరింత దూరమయ్యారా? వచ్చే ఎన్నికల్లో సీటు హుళక్కేనా?

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లో జరిగిన ఓటమికి ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ బాధ్యతపై చర్చ జరుగుతోంది. దగ్గుబాటి ప్రసాద్ పై అసలే వ్యతిరేకత ఉంది. అనేక వివాదాలు గతంలో చుట్టుముట్టాయి. సొంత పార్టీ నేతలే ఎమ్మెల్యేకు వ్యతిరేకమయ్యారు. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి, ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ లకు మధ్య గత కొంతకాలంగా పంచాయతీ నడుస్తుంది. టీడీపీ నాయకత్వం అనేక సార్లు ఇద్దరినీ పిలిచి వార్నింగ్ ఇచ్చింది. కానీ మున్సిపల్ ఎకార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి మిత్రపక్షమైన బీజేపీ అభ్యర్థి ఓటమి పాలవ్వడం, వైసీపీ గెలవడంతో ఆ అపప్రధను మూటగట్టుకున్నారు. ఓటమికి ఓట్ల బదిలీ జరగకపోవడమే ప్రధాన కారణమన్న ఆరోపణలున్నాయి. దీనిపై స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత దీనిపై పార్టీ హైకమాండ్ ఆపరేషన్ నిర్వహించే అవకాశముంది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం, కూటమి అభ్యర్థి ఓడిపోవడం వెనుక స్థానిక టీడీపీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ నాయకత్వం, పార్టీ అంతర్గత విభేదాలు ఒక ముఖ్య కారణమనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో విస్తృతంగా సాగుతున్నాయి.



వార్డులు గెలిచినా...

కార్పొరేషన్ పరిధిలోని 62 డివిజన్లలో కూటమి పార్టీలలో టీడీపీ 30, జనసేన 6, బీజేపీ ఒకస్థానంలో కలిపి 37 స్థానాలను గెలుచుకున్నప్పటికీ, నేరుగా జరిగిన మేయర్ ఎన్నికలో మాత్రం బీజేపీ అభ్యర్థి అజేష్ బాబు వైసీపీ అభ్యర్థి రమేష్ గౌడ్ చేతిలో 5,981 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ ఓటమిలో ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పాత్రఉందని బీజేపీ స్థానిక నేతలు ఆరోపిస్తున్నారు. తమకు దక్కకుండా బీజేపీకి ఆ సీటు కేటాయించడంపై తెలుగు తమ్ముళ్లు అసంతృప్తిగా ఉండటంతో కొంత టీడీపీ ఓట్లు వైసీపీకి పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఇక్కడ గెలిస్తే దగ్గుబాటి ప్రసాద్ ఇంకా రెచ్చిపోతారని భావించి పార్టీలోని ఆయన ప్రత్యర్థులే వెన్నుపోటు పొడిచారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. గతంలో అనేక వివాదాలకు ఆయన కారణం. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులను కూడా దగ్గుబాటి ప్రసాద్ దూరం చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే అనంతపురంలో కూటమికి ఓటమి ఎదురయిందంటున్నారు.

ఓట్లు బదిలీ కాకపోవడంతోనే...

కార్పొరేటర్ అభ్యర్థులకు ఓటు వేసిన కూటమి ఓటర్లు, మేయర్ స్థానానికి వచ్చేసరికి వైసీపీ వైపు మొగ్గు చూపారు. నియోజకవర్గ ఇన్-ఛార్జ్ మరియు ఎమ్మెల్యేగా ఉన్న దగ్గుబాటి ప్రసాద్ తన ఓటర్లను, ముఖ్యంగా టీడీపీ క్యాడర్‌ను కూటమి భాగస్వామి అయిన బీజేపీ అభ్యర్థి వైపు సంపూర్ణంగా మళ్లించడంలో విఫలమయ్యారనే విమర్శలు వ్యతిరేక వర్గాల నుండి వస్తున్నాయి.అనంతపురం మేయర్ స్థానాన్ని దక్కించుకోవాలని స్థానిక టీడీపీ నాయకత్వం మొదటి నుంచి ఆశించింది. అయితే, కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా ఈ సీటు బీజేపీకి వెళ్లడంపై స్థానిక టీడీపీ నాయకుల్లో అసంతృప్తి నెలకొంది. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వర్గానికి, ప్రస్తుత ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ వర్గానికి మధ్య ఉన్న అంతర్గత విభేదాలు, సమన్వయ లోపం కూడా కూటమి అభ్యర్థి ఓటమికి దారితీశాయని స్థానిక విశ్లేషణలు చెప్తున్నాయి.క్షేత్రస్థాయిలో బీజేపీ అభ్యర్థితో కలిసి టీడీపీ శ్రేణులను పూర్తిగా రంగంలోకి దించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారనే చర్చ నడుస్తోంది. కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సరైన సమన్వయ కమిటీలు లేకపోవడం ఎమ్మెల్యే వైఫల్యంగా విమర్శకులు చూపిస్తున్నారు.

బీజేపీ కూడా...

ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ వైరి పక్షాల నుంచి ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్‌పై ఆరోపణలు వచ్చాయి. ఇటువంటి వివాదాలు కూడా పోలింగ్ రోజున తటస్థ ఓటర్లపై ప్రతికూల ప్రభావం చూపించి ఉండవచ్చని భావిస్తున్నారు.అయితే ఈ ఓటమికి కేవలం ఎమ్మెల్యే బాధ్యత మాత్రమే కాకుండా, బీజేపీ అభ్యర్థి ఎంపికపై ఆ పార్టీలోనే ఉన్న అసంతృప్తి, సీనియర్లను పక్కనపెట్టి టికెట్ ఇవ్వడం, మైనారిటీ ఓట్లను ఆకట్టుకోలేకపోవడం మరియు వైసీపీ అనుసరించిన వ్యూహాత్మక ప్రచారం వంటి ఇతర బలమైన కారణాలు కూడా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

గుమ్మడికి బూమ్ రాంగ్ అయిందా? రెబెల్స్ ఓడి సీన్ ఏందో తెలిసిందిగా?

మంత్రిగా ఉండి కూటమి ఆదేశాలను ధిక్కరించడం ఈ ఎన్నికల్లో హైలెట్ అనే చెప్పాలి. కూటమి నిర్ణయించిన అభ్యర్థులను కాకుండా తన సొంత అనుచరులకు పదవులను కట్టబెట్టాలన్న మంత్రిగారి తపన కూటమిలోని ప్రధాన పార్టీ అయిన టీడీపీకి తలనొప్పిగా మారింది. గుమ్మడి సంధ్యారాణి వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి పొత్తును ధిక్కరించడంతో పాటు తమ అనుచరులను రెబల్ గా దించి ఏదో సాధిద్దామని భావించి చతికలపడుతున్నారు.ఇక విషయానికి వస్తే కూటమి పొత్తుని దిక్కరించి, రాష్ట్ర స్తాయి సర్దుబాటులో జనసేనకి ఇచ్చిన సాలూరు మున్సిపాలిటీని జనసేనకి వదలకుండా టీడీపి నుండి రెబల్ ని దింపి, ప్రచారం కూడా చేసారు. ఎక్కడా పొత్తు దర్మాన్ని పాటించకుండా వార్డుల్లో కూడా జనసేన మీద పోటీ పెట్టారు. ఇది గుమ్మడి సంధ్యారాణికి అవమానంగానే చూడాలి. తొలిసారి ఎమ్మెల్యే అయి, తొలిసారి మంత్రి పదవి లక్కుతో పొంది పార్టీ నాయకత్వం ఆదేశాలను ధిక్కరించడాన్ని పలువురు మిత్ర పక్ష పార్టీ నేతలు తప్పుపడుతున్నారు.

తొలిసారి గెలిచి...

సాలూరు నియోజకవర్గానికి గుమ్మడి సంధ్యారాణి తొలిసారి గెలిచారు. ఒకరకంగా చెప్పాలంటే సాలూరు నియోజకవర్గంలో టీడీపీకి పట్టులేదు. కూటమి హవాలో గెలిచారు. గతంలో రెండుసార్లు పోటీ చేసి ఓటమి పాలయిన గుమ్మడి సంధ్యారాణి గాలి వాటంలో గెలిచారు. తనకున్న సామాజికవర్గం కారణంగా ఎమ్మెల్సీ పదవిని అంతకు ముందు పొందారు. టీడీపీకి నమ్మకమైన నేతగా నిలిచినప్పటికీ గుమ్మడి సంధ్యారాణి మున్సిపల్ ఎన్నికల్లో సాలూరు మున్సిపాలిటీలో రెబల్ ను బరిలోకి దించి తమ పార్టీ నేతలకే సవాల్ విసిరారు. కానీ మంత్రి గారి చర్యలను కూటమి పార్టీల కార్యకర్తలు సమర్థించలేదు. కూటమిలో పొత్తులో భాగంగా అది జనసేనకు కేటాయించారు. కానీ తన అనుచరుడి కోసం రెబల్ గా దించి తప్పు చేశారంటూ సొంత పార్టీ నేతలే మంత్రిగారి మీద కారాలు, మిర్రీయలు నూరుతున్నారు. మరొకవైపు జనసేన నేతలు కూడా ఇప్పటకే మంత్రి గుమ్మడి సంధ్యారాణిపై తమ పార్టీ నాయకత్వానికి ఫిర్యాదు చేశారు.

సీన్ తెలిసిపోయిందిగా...

అయితే జనసేన అభ్యర్థి గెలవడంతో ఇక గుమ్మడి సంధ్యారాణి సీన్ చెప్పకనే తెలిసిపోయిందంటున్నారు. ఇక మున్సిపల్ ఎన్నికలతో ఊరుకోని గుమ్మడి సంధ్యారాణి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ తన మద్దతుదారులను రెబల్ గా బరిలోకి దింపారు. జనసేన కు దక్కాల్సిన వాటాను తాము దక్కించుకుని క్రెడిట్ కొట్టేయాలనుకున్న మంత్రి గారి ఆలోచన రివర్స్ అయిందనే అనుకోవాలి. కూటమి లోని టీడీపీ నాయకత్వం కూడా గుమ్మడి సంధ్యారాణిపై చర్యలు తీసుకోకపోవడం ఒకింత జనసైనికులకు ఆగ్రహాన్ని తెప్పించింది. సాలూరులో వరసగా కాంగ్రెస్, వైసీపీలు మూడు ఎన్నికల్లో గెలిచాయి. కానీ మొన్న గాలివాటాన గెలిచిన గుమ్మడి సంధ్యారాణి మాత్రం తాను ఏదో పెద్ద లీడర్ అని పోజులివ్వడం మాత్రం సొంత పార్టీ నేతలకే నచ్చడం లేదు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే గుమ్మడికి మంత్రి పదవి ఊడటం ఖాయమన్న కామెంట్స్ కూటమి పార్టీల నేతల నుంచి వినిపిస్తుంది.

షుగర్ పేషెంట్లకు అలర్ట్.. ఈ 3 విటమిన్లను అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు.. లోపిస్తే ఆరోగ్యంపై మరింత ప్రభావం!



షుగర్ ఉందని తెలిసినప్పటి నుంచి పేషెంట్లు రక్తంలో షుగర్ లెవెల్స్ నియంత్రణపై ఎక్కువ శ్రద్ధ చూపుతారు. షుగర్ లెవెల్స్ కంట్రోల్ లో ఉంటే ఎటువంటి ప్రమాదం లేదని అనుకుంటారు. అయితే షుగర్ లెవెల్స్ నియంత్రణే కాదు.. శరీరంలో విటమిన్ల స్థాయిలపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా విటమిన్ డి, విటమిన్ బి12, విటమిన్ బి1 లోపం ఉంటే షుగర్ వల్ల కలిగే సమస్యలు మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉందంటున్నారు. ఇవి జీవక్రియను అస్థిర పర్చి నరాల దెబ్బతినడం వంటి షుగర్ సంబంధిత సమస్యలను వేగంగా పెంచుతాయని షుగర్ పేషెంట్లు ఈ మూడు విటమిన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. అసలు ఈ విటమిన్లు శరీరంలో ఎలాంటి పాత్ర పోషిస్తాయి? వీటి లోపం డయాబెటిస్ రోగులపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? తెలుసుకుందాం.

షుగర్ ఉన్నవారు విటమిన్ డి , విటమిన్ బి12 ,విటమిన్ బి1 (థయామిన్) స్థాయిలను ఎప్పటికప్పుడు చెక్ చేయించుకోవాలి. ఇవి జీవక్రియ నియంత్రణను మరింత దిగజార్చగలవు.నరాల దెబ్బతినడం వంటి షుగర్ సంబంధిత సమస్యలను ఇవి వేగంగా పెంచుతాయి.

విటమిన్ డి

ఇన్సులిన్ సున్నితత్వాన్ని ,ఇన్సులిన్‌ను తయారుచేసే ప్యాంక్రియాటిక్ బీటా కణాల పనితీరును విటమిన్ డి ప్రభావితం చేస్తుంది. ఇంకా రక్తనాళాల వాపు ,ధమనుల బిగువును తగ్గించడంలో సహాయపడుతుంది.షుగర్ ఉన్నవారిలో 60శాతం నుంచి 70శాతం కంటే ఎక్కువ మందిలో విటమిన్ డి తక్కువగా ఉంటుంది. దీని తక్కువ స్థాయిలు ఇన్సులిన్ నిరోధకతను మరింత పెంచుతాయి. దీంతో మందులతో కూడా రక్తంలో చక్కెరను నియంత్రించడం కష్టమయ్యే అవకాశం ఉంది. గుండె సమస్యల ప్రమాదాన్ని అధికం చేస్తాయి. డి విటమిన్ తగ్గితే అలసట, కండరాల బలహీనత, ఎముక లేదా వెన్ను నొప్పి వంటి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఇలాంటి సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

విటమిన్ బి12 (కోబాలమిన్)

బి12 విటమిన్.. ఎర్ర రక్త కణాల ఏర్పాటు, మెదడు పనితీరు, నరాల చుట్టూ ఉండే రక్షిత మైలిన్ పొరను కాపాడేందుకు ఇది అత్యవసరం. మధుమేహం ఉన్నవారిలో ముఖ్యంగా చాలాకాలంగా మెట్‌ఫార్మిన్ తీసుకునేవారు బి12 లోపానికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే మెట్‌ఫార్మిన్ పేగులలో దాని శోషణకు ఆటంకం కలిగిస్తుంది. అంతేకాకుండా బి12 లోపం డయాబెటిక్ న్యూరోపతికి అంటే చేతులు ,పాదాలలో జలదరింపు, తిమ్మిరి, మంటతో కూడిన నొప్పికి కారణమవుతుంది.అప్పటికే ఆలక్షణాలు ఉంటే మరింత తీవ్రతరం చేస్తుంది. ఇది సాధారణ షుగర్ సంబంధిత నరాల నష్టాన్ని భావించొచ్చు. కాళ్లు చేతులు తిమ్మిరి ,సూదులతో గుచ్చినట్లు అనిపించడం, దీర్ఘకాలిక అలసట, నీరసం, సమతుల్యత సమస్యలు వంటి లక్షణాలుంటే వెంటనే డాక్టర్ ను సంప్రదించి చెక్ చేయించుకోవాలి.

విటమిన్ బి1 (థయామిన్)

శరీరంలో కార్బోహైడ్రేట్లను జీర్ణించుకోవడానికి విటమిన్ బి1 సాయపడుతుంది. అధిక గ్లూకోజ్ జీవక్రియ ఏర్పడే ఉప-ఉత్పత్తుల వల్ల కలిగే నష్టం నుంచి చిన్న రక్తనాళాలను,నరాలను కాపాడుతుంది. అధిక రక్త చక్కెర, శరీరంలో థయామిన్ నిలువలను తగ్గిస్తుంది. విటమిన్ బి1 లోపంతో కంటికి నష్టం కలిగించే డయాబెటిక్ రెటినోపతి, నరాల క్షీణత వంటి మైక్రోవాస్కులర్ సమస్యలను మరింత పెంచుతుంది. అలసట, ఆకలి లేకపోవడం,ప్రారంభ నాడీ సంబంధిత లక్షణాలు విటమిన్ బి1 లోపం వల్ల కనిపిస్తాయి. డయాబెటీస్ ఉన్నవారు కేవలం షుగర్ లెవల్స్ మాత్రమే కాకుండా, కనీసం ఏడాదికోసారైనా ఈ విటమిన్ల స్థాయిలను చెక్ చేసుకొని డాక్టర్ల సలహా మేరకు తగిన జాగ్రత్తలు లేదా సప్లిమెంట్లను తీసుకోవడం చాలా ముఖ్యమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

షుగర్ లేకుండా.. చక్కెర శాతం ఎక్కువ ఉండి.. త్వరగా నిద్రపోతుంటే బరువు తగ్గిపోతారంట



ఈ మధ్య కాలంలో తరుచుగా వింటున్న పదం ప్రీడయాబెటిస్. అంటే షుగర్ లేకున్నా రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉండటం. ఇది టైప్ 2 డయాబెటిస్ రావడానికి ముందు ఉండే ఓ వార్సింగ్ స్టేజ్. ఈ దశలో చాలామంది అధిక బరువుతో బాధపడుతుంటారు. అలాంటి వారిపై ఇటీవల జరిపిన పరిశోధనల్లో నిద్ర క్వాలిటి, సమయం, నిద్ర వ్యవధి చాలాకీలకం అని బరువు మెయింటెన్ చేయడంలో ఇవి చాలా అవసరమని తేల్చారు పరిశోధకులు. ప్రీడయాబెటిస్ ఉన్నవారు త్వరగా నిద్రపోవడం వల్ల అధిక బరువు తగ్గే అవకాశం ఉందని న్యూయార్క్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ జరిపిన కొత్త అధ్యయనం పేర్కొంది. నిద్రపోయే సమయం, వ్యవధి, నాణ్యత వంటివి మూడూ శరీర బరువు నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధకులు తెలిపారు. న్యూయార్క్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సూసన్ కోల్ మలోన్ మాట్లాడుతూ.. మనం ఎంత సేపు నిద్రపోతున్నాం అనే దానితో పాటు ఎప్పుడు నిద్రపోతున్నాం

అనే విషయం కూడా బరువు తగ్గడంలో, మెటబాలిక్ ఆరోగ్యంలో చాలా ముఖ్యమైనది .. చాలామంది ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని అన్నారు.

ఈ అధ్యయనం చీబతీంఅఅస్త్ర =వంఘుతీఎష్ట్ర జర్నల్‌లో ప్రచురితమైంది. రోజుకు 6.5 గంటల కంటే తక్కువ నిద్రపోయే ప్రీడయాబెటిస్ వ్యక్తులు దాదాపు 200 మందిపై ఈ పరిశోధన చేశారు. వారిని రెండు గ్రూపులుగా విభజించి రెండు గ్రూపులకు 8 వారాల పాటు వీడియో కాల్స్ ద్వారా ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ, మానసిక ఒత్తిడి నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. . అదనంగా ఒక గ్రూప్‌కు స్లీప్ కోచింగ్ ఇచ్చారు. నిద్ర వేళను క్రమంగా ముందుకు జరపడం, స్థిరమైన షెడ్యూల్ పాటించడం, పడకను నిద్రతోనే అనుసంధానించేలా అలవర్చుకోవడం వంటివి ఆ సెషన్లలో నేర్పించారు.8 వారాల తర్వాత చూస్తే, నిద్ర వేళ ఒక్కో గంట ముందుకు జరిగిన కొద్దీ దాదాపు 1.3 పౌండ్లు (0.73 కిలోలు) అదనంగా తగ్గినట్టు గుర్తించారు. నిద్ర వ్యవధి మాత్రమే పెరిగిన వారిలో ఇదే స్థాయి ఫలితం కనిపించలేదు.రాత్రిపూట ఆలస్యంగా తినడం తగ్గడం, శరీరం ఇన్సులిన్‌ను సమర్థంగా వినియోగించుకునే సమయానికి అనుగుణంగా భోజనం ఉండటం వంటివి ముందు నిద్రపోవడం వల్ల కలిగే ప్రయోజనాలని పరిశోధకులు వివరించారు.అయితే ఈ అధ్యయనం ఫలితాలు ప్రీడయాబెటిస్‌కు చికిత్సగా పరిగణించరాదని, ఆహారపు అలవాట్లు ,శారీరక శ్రమకు ప్రత్యామ్నాయం కాదని పరిశోధకులు స్పష్టం చేశారు. 8 వారాల కాలంలో రక్తంలో చక్కెర స్థాయుల్లో మార్పు నమోదు కాలేదని కూడా తెలిపారు.

సంపాదకీయం

పునర్నిర్మాణానికి అండ!

వారం రోజుల్లో రెండు తుపాన్లు, అర్నాబ్, మురసు, ఆంధ్రప్రదేశ్ తీరాన్ని కుదిపేశాయి. ముందస్తు సన్నద్ధత, సాంకేతికత వల్ల ప్రాణనష్టం తగ్గినా, అర్నాబ్ నష్టమే సుమారు రూ.4,500 కోట్లు దాటింది. వేలాది హెక్టార్ల పంటలు నీట మునిగి, వేల విద్యుత్ స్తంభాలు, సెల్ టవర్లు కూలాయి. తక్షణ సాయంగా రూ.4,500 కోట్లకు పైగా ఇవ్వాలని రాష్ట్రం కేంద్రాన్ని కోరింది. పంట బీమా పథకాన్ని మెరుగుపరచి, శాశ్వత పునర్నిర్మాణానికి కేంద్రం అండగా నిలవాలన్నదే ఇప్పటి డిమాండ్. వారం రోజుల్లో రెండు తుపాన్లు, అర్నాబ్, మురసు, ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకాయి. ముందస్తు సన్నద్ధత, అధికారుల వేగవంతమైన స్పందన వల్ల ప్రాణనష్టం తక్కువగా ఉండటం ఊరట కలిగించే విషయం. అక్టోబర్ 28న అర్నాబ్ 'అతి తీవ్ర తుపాను'గా యానాం, నరసాపురం మధ్య తీరం దాటింది. ఈ తుపాను వల్ల రాష్ట్రంలో నష్టం సుమారు రూ.4,526 కోట్ల నుంచి రూ.4,600 కోట్ల వరకు ఉంటుందని అంచనా. పంటలకూ భారీ నష్టం జరిగింది: ముఖ్యమంత్రి చెప్పిన ప్రకారం సుమారు 70,900 హెక్టార్ల వరి, 10,450 హెక్టార్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి; మరికొన్ని అంచనాల ప్రకారం మొత్తం 3 లక్షల హెక్టార్లకు పైగా పంట మునిగింది. అర్నాబ్ కారణంగా ఒడిశా దక్షిణ ప్రాంతాల్లో కూడా సుమారు 75,000 నుంచి 90,000 హెక్టార్ల పంటలు దెబ్బతిన్నాయి. ఆ తర్వాత నవంబర్ 3న ఒంగోలు దగ్గర మురసు తుపాను తీరం దాటింది. ప్రాథమిక అంచనా ప్రకారం 15 జిల్లాల్లో సుమారు 52,500 హెక్టార్ల నిలువు పంటలు దెబ్బతిన్నాయి, నష్టం సుమారు రూ.344 కోట్లు. రెండు తుపాన్లతో ఆంధ్రప్రదేశ్‌లో ఏడుగురు చనిపోయారని రాష్ట్రం తెలిపింది (కొన్ని నివేదికల్లో ఈ సంఖ్య కొంత ఎక్కువగా ఉంది). 'తీవ్ర తుపాను' హెచ్చరికల తర్వాత 57,000 మందిని, మురసు ముందు 30,000 మందిని సురక్షిత కేంద్రాలకు తరలించారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు నుంచి సహాయక బృందాలు కూడా ఆంధ్రప్రదేశ్‌కు తరలివచ్చాయి. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్), డాప్లర్ రాడార్లు వంటి సాంకేతికత మానవ నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించింది. 2014 అక్టోబర్‌లో హుద్‌హుద్ తుపానులో 63 మంది చనిపోగా, నష్టం సుమారు రూ.22,000 కోట్లు ఉంది; దానితో పోలిస్తే ఇప్పటి పరిస్థితి చాలా మెరుగు. అయితే సహజ విపత్తులు మన దేశంలో తరచుగా వస్తున్నాయి. ఈ ఏడాది ఎల్‌నినో కారణంగా ఉత్తర హిందూ మహాసముద్రంలో తుపాన్లు తగ్గుతాయని అంచనా వేసినా, ఐదు రోజుల్లో రెండు తుపాన్లు వచ్చాయి. కాబట్టి ముందస్తు అంచనా, నష్ట నివారణ కోసం ఉన్నత విద్యా సంస్థలు, ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల మధ్య మరింత సహకారం అవసరం.

తుపాను దెబ్బ ఎక్కువగా తగిలేది రైతులకే. పంట నష్టానికి సమర్థవంతమైన పరిహార విధానాన్ని అధికారులు రూపొందించాలి. పదేళ్ల క్రితం కేంద్రం ప్రారంభించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయే రైతులకు సమగ్ర భద్రత ఇవ్వలేకపోయిందన్న విమర్శ ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 22 నోటిఫై చేసిన పంటలకు రూ.15,969 కోట్ల బీమా కవరేజీ ఉంది; అర్నాబ్ వల్ల సుమారు 4.6 లక్షల మంది రైతులు ప్రభావితమయ్యారని అంచనా. బీమా క్లెయిమ్‌లు, ఇన్‌పుట్ సబ్సిడీని వేగంగా ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైతులకు గరిష్ఠ సాయం ఇప్పిస్తామని, పంట నష్టం అంచనా తర్వాత అదనపు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని హామీ ఇచ్చారు; ఎకరాకు రూ.700-800 ప్రీమియంతో పంట బీమా తీసుకోవాలని రైతులకు సలహా ఇచ్చారు. కానీ చాలామంది రైతులు, ముఖ్యంగా కౌలు రైతులు, బీమా పరిధిలో లేరు; ప్రీమియం కట్టలేనివారు, పథకం గురించి తెలియనివారు చాలా మంది. అందుకే కేంద్రం ఈ పథకాన్ని మెరుగుపరచాలి, తద్వారా అన్ని రైతులు తమ పంటలను ఇందులో చేర్చేలా ప్రోత్సాహం లభించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు బీమా గురించి అవగాహన పెంచాలి, బీమా పరిధిలోని ప్రయోజనాలకు అదనంగా తమ వాటాను జత చేసి రైతులకు తోడ్పాటు ఇవ్వాలి. క్లెయిమ్‌ల చెల్లింపు ఆలస్యం కాకుండా చూడటం, కౌలు రైతులకు సబ్సిడీ నేరుగా చేరేలా చేయడం కూడా అంతే ముఖ్యం.

ఇక కేంద్ర, రాష్ట్ర సంబంధాల విషయం. తుపాను తర్వాత ప్రజా మౌలిక సదుపాయాలు ఎంతగా దెబ్బతిన్నాయో మురసు తుపాను చూపింది: సుమారు 31,000 విద్యుత్ స్తంభాలు, 200 సెల్ టవర్లు దెబ్బతిన్నాయి, 4,095 గ్రామాల్లో కరెంటు పోయింది, 312 ఇళ్లు కూలిపోయాయి. అర్నాబ్ 781 గ్రామాలను, మురసు 465 గ్రామాలను ప్రభావితం చేశాయి. ఈ సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడి, తక్షణ కేంద్ర సాయంగా రూ.4,500 కోట్లకు పైగా కోరుతూ లేఖ రాశారు (అర్నాబ్‌కు రూ.4,563 కోట్లు, మురసుకు రూ.343 కోట్లు). కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ముఖ్యమంత్రితో మాట్లాడి అన్ని విధాల సాయం చేస్తామని హామీ ఇచ్చారు; జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) 38 బృందాలను ఐదు రాష్ట్రాల్లో మోహరించింది, వాటిలో 14 ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రాథమిక పరిశీలన తర్వాత కేంద్రం తొలి విడత నిధులు త్వరలో విడుదల చేస్తుందని ఆశిస్తున్నారు; ఒడిశాకు కేంద్ర బృందం నవంబర్ 2న వచ్చింది. గతంలో కేంద్రం వైఖరి ఇలా ఉండేది: జాతీయ, రాష్ట్ర విపత్తు స్పందన నిధులు సహాయ చర్యల కోసమే కానీ పునరుద్ధరణ, పునర్నిర్మాణం కోసం కాదు. 15వ ఆర్థిక సంఘం సూచన తర్వాత, రెండేళ్ల క్రితం ఈ రెండు నిధుల్లో పునరుద్ధరణ, పునర్నిర్మాణం అంశాన్ని కూడా చేర్చారు. అయినా ప్రజా మౌలిక సదుపాయాలకు భారీ నష్టం జరిగినప్పుడు, ప్రభావిత రాష్ట్రాలపై భారం తగ్గించడానికి కేంద్రం అదనపు సాయం అందించాలి. హుద్‌హుద్ సమయంలో ప్రధాని మోదీ విశాఖను సందర్శించి రూ.1,000 కోట్ల మధ్యంతర సాయం ప్రకటించారు; ఇప్పుడు కూడా అదే వేగం, అదే ఔదార్యం కనిపించాలి. స్వల్పకాలిక సాయంతో పాటు శాశ్వత పునరుద్ధరణ ప్రాజెక్టులకు, ఉదాహరణకు తుపాన్లను తట్టుకునే విద్యుత్, సమాచార వ్యవస్థలకు, ఆర్థిక సాయంపై కేంద్రం దృష్టి పెట్టాలి. ప్రధాని మోదీ, ఆయన బృందం "సహకార సమాఖ్య" స్ఫూర్తితో వ్యవహరించాలి; ఇది పార్టీల రాజకీయం కాకుండా, తుపాను బాధిత ప్రజల పట్ల బాధ్యతగా ఉండాలి.

ఊపిరి ఆగకముందే.. మేల్కోవాలి

దేశ రాజధాని ఢిల్లీ మరోసారి కాలుష్య కోరల్లో చిక్కుకుంది. వరుసగా మూడో రోజూ గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి చేరడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఏక్యూఐ 450 దాటడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. వాహనాల పొగ, నిర్మాణ ధూళి, పరిశ్రమల కాలుష్యం, పంట వ్యర్థాల దహనం, దీపావళి టపాసులు.. ఇలా అనేక కారణాలు ఢిల్లీ గాలిని విషతుల్యం చేస్తున్నాయి. ప్రతి ఏటా శీతాకాలం రాగానే ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నా, ప్రభుత్వాల చర్యలు మాత్రం తాత్కాలికంగానే మిగులుతున్నాయి. కాలుష్యం ముదిరాక స్పందించడం కాకుండా, ముందస్తు ప్రణాళికతో నివారించాల్సిన అవసరం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అసలు ఢిల్లీని వెంటాడుతున్న ఈ కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు?



దేశ రాజధాని గాలి వరుసగా మూడో రోజు 'చాలా దారుణ' (వెరీ పూర్) స్థాయిలోనే ఉంది. గురువారం ఉదయం గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) సుమారు 370 వద్ద ఉంది; బుధవారం 24 గంటల సగటు 377కు చేరి, 288 రోజుల్లో అత్యంత చెత్త స్థాయిగా నమోదైంది. నగరంలోని 59 పర్యవేక్షణ కేంద్రాల్లో 18 నుంచి 22 కేంద్రాలు 'తీవ్ర' (సివియర్) స్థాయిని దాటాయి; జహంగీర్‌పురిలో సూచీ 459 వరకు వెళ్లింది. ఊపిరితిత్తుల్లోకి, అక్కడి నుంచి రక్తంలోకి చొచ్చుకుపోయే సూక్ష్మ ధూళి కణాలైన పీఎం2.5 ప్రధాన కాలుష్య కారకం. రాబోయే రెండు రోజులూ గాలి 'తీవ్ర' స్థాయికి చేరే అవకాశం ఉందని అంచనా; దీపావళి కూడా దగ్గరపడుతోంది. ఈ పరిస్థితి వెనుక ఉన్నది ప్రణాళికా వైఫల్యం. ఢిల్లీ పొగమంచుకు ఒక్క విలన్ లేడు, అందుకే ఒక్క మందూ దొరకలేదు. ఏడాదంతా నగరం గాలిని వాహనాలు, రోడ్లు, నిర్మాణ ధూళి, పరిశ్రమలు, చెత్త, బయోమాస్ దహనం, ఇంటి ఇంధనాలు కలుషితం చేస్తూనే ఉంటాయి. అక్టోబర్, నవంబర్‌లో పంజాబ్, హర్యానా తదితర చోట్ల పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వచ్చే పొగ ఒక సీజనల్ పొరగా జతవుతుంది; దీపావళి టపాసులు ఆ గరిష్ఠ స్థాయిని మరింత పెంచుతాయి. పంట వ్యర్థాల దహనం వాటా రోజురోజుకూ మారుతుంటుంది. గత నవంబర్‌లో అది ఢిల్లీ పీఎం2.5లో సుమారు 7 శాతం మాత్రమే (అంతకుముందు ఏడాది సుమారు 20 శాతం), అయినా నెలలో చాలా రోజులు గాలి 'చాలా దారుణ' నుంచి 'తీవ్ర' స్థాయిలో ఉంది; స్థానిక ఉద్గారాలే కాలుష్యాన్ని ఎక్కువగా ఉంచాయని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) తేల్చింది. ఈ రోజు నివేదికల ప్రకారం పంట వ్యర్థాల వాటా 20.2 శాతం, రవాణా వాటా 15.5 శాతం; అంటే వాటాలు మారినా, రెండూ ముఖ్యమే. వాతావరణం కూడా సహకరించదు: నవంబర్ నుంచి జనవరి వరకు ఢిల్లీ వాతావరణ పొర ఎత్తు ఒక కిలోమీటర్ కంటే తక్కువగా ఉంటుందని, పొర ఎత్తు తగ్గేకొద్దీ పీఎం2.5 పెరుగుతుందని 2026 అధ్యయనం చెబుతోంది. పంట కోతలు, పండుగలు, తగ్గే ఉష్ణోగ్రతలు, నిలిచిపోయే గాలి ప్రతి ఏటా ఒకే క్యాలెండర్‌లో వస్తాయి. అంటే ఇది అనూహ్య విపత్తు కాదు, ముందే తెలిసిన సమస్య.

సమయానికి రాని దానిని చెప్పాలంటే, స్పందనే. ఢిల్లీ అత్యవసర కార్యాచరణ 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్' (గ్రాప్) తీసుకోండి. గాలి ఇప్పటికే చెడిపోయాకే ఇది అమల్లోకి వస్తుంది; అంటే నష్టం మొదలయ్యాకే చర్య మొదలవుతుంది. ఈ సోమవారం గ్రాప్ రెండో దశ అమలైంది, అది కూడా సాయంత్రం ఐదు గంటలకు సూచీ 325కు చేరాక. 2025 జనవరి నుంచి 2026 జనవరి మధ్య 17 సార్లు గ్రాప్ అమలు చేయగా, 13 సార్లు గాలి నాణ్యత పరిమితిని దాటాకే చేశారు. సీఆర్ఈఏ అధ్యయనం ప్రకారం 2024 నవంబర్‌లో ఢిల్లీ పీఎం2.5 సగటు క్యూబిక్ మీటరుకు 249 మైక్రోగ్రాములు, ఎనిమిదేళ్లలో ఏ నవంబర్‌లోనూ ఇంత లేదు; తీవ్రమైన రోజు వస్తుందని వాతావరణ నిపుణులు హెచ్చరించినా కఠిన దశలను ఆలస్యంగా అమలు చేశారని కూడా అది ఎత్తిచూపింది. అసలు సమస్య అధికార పరిధి. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ ఒకే గాలి ప్రదేశాన్ని (ఎయిర్‌షెడ్) పంచుకుంటాయి, కానీ పాలన రాష్ట్రాల వారీగా సాగుతుంది. ఈ అంతరాన్ని పూడ్చడానికే వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) ఏర్పడింది. 2018-19 నుంచి కేంద్రం పంట వ్యర్థాల యంత్రాల కోసం రూ.3,120 కోట్లకు పైగా ఖర్చు చేసింది; ఈ ఏడాది పంట వ్యర్థాల దహనాన్ని పూర్తిగా ఆపాలని కమిషన్ ఆదేశించింది; పంట వ్యర్థాల దహనాన్ని అడుపు చేయడంలో విఫలమైన పంజాబ్ జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చింది. అయినా దహనాలు కొనసాగుతూనే ఉన్నాయి, ఒకరిపై ఒకరు నిందలు వేసే ఆట కూడా. ఈసారి మంచి విషయం ఏమిటంటే, ఢిల్లీ 2026-27 శీతాకాల కార్యాచరణ, నవంబర్ 1 నుంచి నిర్మాణ ధూళి నిషేధంతో సహా, పొగమంచు రాకముందే ప్రకటించారు, ఇది తరచూ జరగదు. గురుగ్రామ్ కూడా నవంబర్ 5 నుంచి 20 వరకు ధూళి పుట్టించే పనులను నిలిపివేసింది. సుప్రీంకోర్టు సర్టిఫైడ్ గ్రీన్ టపాసులను నవంబర్ 7-8 తేదీల్లో, పరిమిత సమయాల్లో (ఉదయం 6-7, రాత్రి 8-10) మాత్రమే అనుమతించింది. ఈ చర్యలు అవసరమే, కానీ చాలా ఆలస్యంగా వచ్చే అత్యవసర చర్యలు ఎంతవరకు పనిచేస్తాయన్నది ప్రశ్న.

ఒక నగరం ఊపిరాడకుండా ఉండటం యాదృచ్ఛికం కాదు. ప్రతి శీతాకాలాన్ని క్యాలెండర్‌లో ఉన్న పనిగా కాకుండా అత్యవసర పరిస్థితిగా నిర్వహించినప్పుడే ఇలా జరుగుతుంది. అవసరమైంది పన్నెండు నెలల స్వచ్ఛ వాయు నిబద్ధత. అధికారులు గాలి రీడింగ్ మీద కాదు, అంచనా మీద చర్య తీసుకోవాలి. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు తీవ్రమైన కాలుష్యాన్ని రోజుల ముందే చూడగలవు; ఆ హెచ్చరికపైనే గ్రాప్ దశలను ముందుగానే అమలు చేయాలి. ముఖ్యంగా, ఏడాది పొడవునా ఒక్కొక్క మూలాన్ని ఒక్కొక్కటిగా పరిష్కరించాలి: శుభ్రమైన, ఎక్కువ ప్రజా రవాణా; యంత్రాలతో రోడ్ల ఊడ్పు; నిర్మాణ నిబంధనల అమలు; పరిశ్రమల్లో శుభ్రమైన ఇంధనం; చెత్త డంపింగ్ యార్డుల్లో, రోడ్డు పక్కన మంటలకు ముగింపు. రైతులను నిందించడం కాకుండా, వారికి యంత్రాలు, ప్రత్యామ్నాయాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు సమయానికి చేరేలా చూడాలి; రాష్ట్రాల మధ్య సమన్వయం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించాలి. పౌరులుగా మనమూ వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించడం, టపాసులు కాల్చకపోవడం, చెత్త కాల్చకపోవడం వంటి చిన్న చర్యలతో వాటా పంచుకోవచ్చు. నవంబర్ 1న మొదలయ్యే ప్రణాళిక అప్పటికే ఆలస్యం. ఢిల్లీకి ప్రతి ఏటా మంటలార్పే పద్ధతి అవసరం లేదు; ప్రతి ఏటా అత్యవసర పరిస్థితే రాకుండా ఆపడమే అవసరం. ■

పనికొచ్చే పలుకు



అదే.. అసలు సంపద సూత్రం

ధనవంతులు కావాలని చాలామంది కలలుగంటారు. అందుకోసం మంచి ఉద్యోగం రావాలని, నెలకు లక్షల్లో జీతం సంపాదించాలని, పెద్ద వ్యాపారం చేయాలని ఆశపడుతుంటారు. నిజమే.. ఆదాయం పెరిగితే ఆర్థికంగా ఎదగడానికి అవకాశాలు మెరుగుపడతాయి. కానీ ఎక్కువ సంపాదించిన ప్రతి ఒక్కరూ ధనవంతులు కాలేరు. ఎందుకంటే సంపదకు సంపాదన ఒక్కటే కొలమానం కాదు. సంపాదించిన దాంట్లో ఎంత మిగుల్చుకుంటున్నామన్నదే అసలైన లెక్క! ఒక చిన్న ఉదాహరణ తీసుకుందాం. ఇద్దరు వ్యక్తులు ఒకే సంస్థలో పనిచేస్తున్నారు. మొదటి వ్యక్తి నెలకు రూ.లక్ష సంపాదిస్తున్నాడు. ఖరీదైన ఇల్లు, కారు, బ్రాండెడ్ దుస్తులు, రెస్టారెంట్లలో భోజనాలు.. ఇలా తన ఆదాయానికి తగ్గట్టుగా కాకుండా హోదాకు తగ్గట్టుగా జీవిస్తున్నాడు. నెలాఖరుకు అతని చేతిలో రూపాయి కూడా మిగలడం లేదు. అప్పుడప్పుడు క్రెడిట్ కార్డు బిల్లులు, ఈఎంఐలు అదనపు భారంగా మారుతున్నాయి. మరో వ్యక్తి నెలకు రూ.50 వేలు మాత్రమే సంపాదిస్తున్నాడు. కానీ తన ఖర్చులను రూ.30 వేలకే పరిమితం చేసుకున్నాడు. మిగిలిన రూ.20 వేలలో కొంత అత్యవసర అవసరాలకు, మరికొంత పెట్టుబడులకు కేటాయిస్తున్నాడు. ఇప్పుడు చెప్పండి.. ఈ ఇద్దరిలో ఆర్థికంగా బలంగా ఉన్నది ఎవరు?


నిజానికి సంపన్నులుగా మారే ప్రయాణం ఇక్కడే మొదలవుతుంది. మన ఆదాయం ఎంతన్నది ముఖ్యం కాదు.. ఆ ఆదాయాన్ని ఎలా నిర్వహిస్తున్నామన్నదే ముఖ్యం. నెలకు రూ.50 వేలు సంపాదిస్తూ రూ.30 వేలతో సంతోషంగా జీవించగలిగితే, మిగిలిన రూ.20 వేలు మన భవిష్యత్తుకు పునాది అవుతాయి. ఏడాదికి రూ.2.4 లక్షలు పొదుపు చేయగలుగుతాం. ఆ మొత్తాన్ని సరైన ప్రణాళికతో పెట్టుబడి పెడితే కాలక్రమంలో అది మరింత సంపదను సృష్టించే అవకాశం ఉంటుంది.

అయితే ఖర్చులు తగ్గించుకోవడమంటే జీవితంలోని ఆనందాలను చంపుకోవడం కాదు. అవసరాలకు, విలాసాలకు మధ్య తేడా గుర్తించడం. మనకు నిజంగా అవసరమా? లేక పక్కవారి దగ్గర ఉంది కాబట్టి మనకూ కావాలనుకుంటున్నామా? అనే ప్రశ్న వేసుకోవడం. ఇతరులను చూసి ఖరీదైన ఫోన్లు కొనడం, అవసరం లేకున్నా కొత్త వాహనాలు తీసుకోవడం, ఆదాయానికి మించిన ఇల్లు, ఈఎంఐలతో జీవితాన్ని భారంగా మార్చుకోవడం వంటివి ఆర్థిక స్వేచ్ఛకు అడ్డంకులు. ముఖ్యంగా సోషల్ మీడియాలో కనిపించే విలాసవంతమైన జీవితాలను చూసి మన జీవితాన్ని అంచనా వేసుకోవడం మానుకోవాలి.

మరో ముఖ్యమైన విషయం.. జీతం వచ్చిన తర్వాత మిగిలితే పొదుపు చేద్దామనుకోవద్దు. ముందుగా పొదుపు, పెట్టుబడులకు కొంత మొత్తం కేటాయించి, మిగిలిన దానితో ఖర్చులను నిర్వహించుకోవాలి. కనీసం 20 శాతం ఆదాయాన్ని భవిష్యత్తు కోసం కేటాయించే అలవాటు చేసుకోవాలి. అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. అప్పులను తగ్గించుకోవాలి. ఆదాయం పెరిగిన ప్రతిసారీ ఖర్చులను కూడా పెంచుకోవడం కాకుండా, పొదుపు, పెట్టుబడులను పెంచుకోవాలి.

గుర్తుంచుకోండి.. ధనవంతులు కావడానికి పక్కవారికంటే ఎక్కువ సంపాదించాల్సిన అవసరం లేదు. నిన్నటికంటే మెరుగైన ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటే చాలు. మన సంపాదన మన కోసం పనిచేసేలా చేసుకోవాలి. ఖరీదైన వస్తువులు కొనగలగడం సంపన్నత కాదు.. అవసరమైనప్పుడు డబ్బు కోసం ఎవరి ముందూ చేయి చాచాల్సిన పరిస్థితి లేకపోవడమే నిజమైన ఆర్థిక స్వేచ్ఛ.

సంపాదన మీకు జీవనాన్ని ఇస్తుంది.. పొదుపు భద్రతను ఇస్తుంది.. తెలివైన పెట్టుబడులు భవిష్యత్తును నిర్మిస్తాయి. కాబట్టి ధనవంతులు కావాలంటే ముందుగా మీ ఆదాయాన్ని కాదు.. మీ జీవనశైలిని మార్చుకోండి!



నిజమైన ఆనందం ఖరీదైన వస్తువుల్లోనో, విలాసవంతమైన జీవితంలోనో ఉండదు. ఇతరులతో పోల్చుకోకుండా, తమకు ఉన్నదానితో సంతృప్తి చెందుతూ, కావాల్సిన వాటిని మాత్రమే కోరుకునే మనస్తత్వంలో ఉంటుంది. పక్కవారి దగ్గర ఉన్నాయని మనకూ అన్నీ కావాలనుకోవడం మొదలుపెడితే జీవితమంతా పరుగులే మిగులుతాయి. ఎంత సంపాదించినా ఏదో ఒకటి తక్కువగానే అనిపిస్తుంది. కానీ మన అవసరాలకు, ఆశలకు మధ్య హద్దులు నిర్ణయించుకోగలిగితే మనసుకు ప్రశాంతత లభిస్తుంది. గుర్తుంచుకోండి.. సంపద అంటే ఎన్ని వస్తువులు సొంతం చేసుకున్నామన్నది కాదు.. ఉన్న జీవితాన్ని ఎంత ఆనందంగా అనుభవిస్తున్నామన్నదే!

-మహాదేవ

వింతల్లో వింతలు

టెన్నెస్సీలో కోతి కలకలం



అమెరికాలోని టెన్నెస్సీ రాష్ట్రం క్రాకెట్ కౌంటీలో ఓ వింత ఘటన చోటుచేసుకుంది. బ్రిమ్స్ కార్నర్ ప్రాంతంలో ఓ చిన్న గోధుమ రంగు కోతి పొలంలో తిరుగుతుండటాన్ని స్థానికులు గుర్తించారు. అంతేకాదు.. ఆ కోతిని చూసిన ఓ మహిళ పెంచుకుంటున్న కుక్క భయంతో ఇంట్లోకి రావడానికి కూడా నిరాకరించిందట! దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కోతి కోసం గాలింపు చేపట్టారు. సమీపంలోని సఫారీ పార్కులో విచారించగా, తమ జంతువులన్నీ క్షేమంగానే ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. దీంతో ఈ కోతి ఎక్కడి నుంచి వచ్చిందన్నది మిస్టరీగా మారింది. కోతిని ఎవరైనా పెంచుకుంటున్నారా? లేక అది సొంతంగా విహారయాత్రకు వచ్చిందా? అంటూ పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో రిటైర్.. 23 ఏళ్ల ప్రస్థానానికి ముగింపు



ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో సంచలన నిర్ణయం తీసుకున్నాడు. పోర్చుగల్ జాతీయ జట్టు తరఫున తన అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించాడు. 23 ఏళ్ల పాటు సాగిన ప్రస్థానానికి వీడ్కోలు చెబుతూ సోషల్ మీడియాలో భావోద్వేగ వీడియోను పంచుకున్నాడు. పోర్చుగల్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా, అత్యధిక గోల్స్ చేసిన ఫుట్‌బాలర్‌గా రికార్డులు సృష్టించిన 41 ఏళ్ల రొనాల్డో.. ఇకపై జాతీయ జట్టు తరఫున మైదానంలో కనిపించడు. తనకు ఎంతో ప్రత్యేకమైన 7వ నంబర్ జెర్సీని తర్వాతి తరం ఆటగాడికి అందించనున్నట్లు వెల్లడించాడు.

"జాతీయ జట్టు తరఫున మైదానంలో నా ప్రయాణం నేటితో ముగుస్తోంది. నేను సాగించిన ప్రస్థానం పట్ల గర్వంగా ఉంది. పోర్చుగల్ కోసం నా శక్తినంతా ధారపోశాననే సంతృప్తితో వీడ్కోలు చెబుతున్నా" అని రొనాల్డో తన సందేశంలో పేర్కొన్నాడు. అభిమానులు, కుటుంబ సభ్యులు, తనతో కలిసి ఆడిన సహచరులకు కృతజ్ఞతలు తెలిపాడు. 7వ నంబర్ జెర్సీ ఇక మరొకరి సొంతమైనా.. దానిని ధరించిన గర్వం తనకు ఎప్పటికీ ఉంటుందని చెప్పాడు.

కోచ్‌తో వివాదం.. చివరి రోజుల్లో కలకలం

రొనాల్డో అంతర్జాతీయ కెరీర్ ముగింపు ప్రకటనకు ముందు పోర్చుగల్ జట్టులో పరిణామాలు చర్చనీయాంశమయ్యాయి. ప్రధాన కోచ్ జార్జ్ జీసస్‌తో అతడికి విభేదాలు తలెత్తాయి. సెప్టెంబర్ 27న నార్వేతో జరిగిన నేషన్స్ లీగ్ మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1తో గెలిచినా.. రొనాల్డోకు ఒక్క నిమిషం కూడా ఆడే అవకాశం దక్కలేదు. ఫిట్‌నెస్ నిర్వహణలో భాగంగా తనకు విశ్రాంతి ఇస్తారని తొలుత చెప్పారని, ఆ తర్వాత నార్వేతో మ్యాచ్‌లో సుమారు 30 నిమిషాలు ఆడిస్తానని కోచ్ హామీ ఇచ్చాడని రొనాల్డో వెల్లడించాడు. విరామ సమయంలో వార్మప్ చేసినా మైదానంలోకి దిగే అవకాశం రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశాడు.

మ్యాచ్ తర్వాత మీడియాకు పరిస్థితిని వివరిస్తానని కోచ్ తనతో అంగీకరించిన విషయానికి భిన్నంగా మాట్లాడాడని రొనాల్డో ఆరోపించాడు. అయితే జట్టును ఎంపిక చేసే బాధ్యత తనదేనని జీసస్ స్పష్టం చేశారు. ఈ వివాదం నేపథ్యంలో డెన్మార్క్‌తో మ్యాచ్‌కు ముందు కోపెన్‌హేగన్‌లోని జట్టు శిబిరం నుంచి రొనాల్డో వెళ్లిపోయాడు. దీనిపై పోర్చుగల్‌లో విమర్శలు వెల్లువెత్తాయి. అనంతరం తన నిర్ణయం తప్పేనని అంగీకరించిన రొనాల్డో.. సహచర ఆటగాళ్లు, అభిమానులకు క్షమాపణలు చెప్పాడు.ఈ ఘటనపై పోర్చుగల్ ఫుట్‌బాల్ సమాఖ్య అతడికి 30 రోజుల సస్పెన్షన్‌తో పాటు 255 యూరోల జరిమానా విధించింది. అయితే ఆ శిక్షను వెనక్కి తీసుకోవడంతో తర్వాతి మ్యాచ్‌లకు అతడు అందుబాటులో ఉండే అవకాశం లభించింది. 2026 ప్రపంచకప్ తర్వాత అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకాలని గతంలో భావించిన రొనాల్డో.. సమాఖ్య అధ్యక్షుడు పెడ్రో ప్రోయెంకా సూచనతో ఆ నిర్ణయాన్ని పునరాలోచించినట్లు కథనంలో పేర్కొన్నారు.

రొనాల్డో రికార్డుల ప్రస్థానం

2003 ఆగస్టులో కజకిస్థాన్‌తో మ్యాచ్ ద్వారా పోర్చుగల్ జట్టులోకి అడుగుపెట్టిన రొనాల్డో.. ఆ మరుసటి ఏడాదే యూరో 2004 ఫైనల్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో గ్రీస్ చేతిలో పోర్చుగల్ ఓడిపోయినా.. జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. 2006 ప్రపంచకప్, 2012 యూరో కప్‌లలో పోర్చుగల్ సెమీఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. 2016 యూరో కప్ ఫైనల్‌లో ఫ్రాన్స్‌తో తలపడిన సమయంలో గాయంతో తొలి అర్ధభాగంలోనే రొనాల్డో మైదానం వీడాడు. అయినప్పటికీ పక్కన నిలబడి సహచరులను ఉత్సాహపరిచాడు. అదనపు సమయంలో ఎడెర్ చేసిన గోల్‌తో పోర్చుగల్ తొలి యూరో కప్ టైటిల్‌ను అందుకుంది. 2019లో స్విట్జర్లాండ్‌పై సెమీఫైనల్‌లో హ్యాట్రిక్ సాధించి నేషన్స్ లీగ్ తొలి టైటిల్ గెలవడంలోనూ రొనాల్డో కీలక పాత్ర పోషించాడు. 2025లో స్పెయిన్‌తో ఫైనల్‌లోనూ గోల్ చేసి రెండోసారి నేషన్స్ లీగ్ విజేతగా నిలిచిన జట్టులో భాగమయ్యాడు.

పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లు ఆడి 146 గోల్స్ చేసిన రొనాల్డో.. పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో ఈ రెండు విభాగాల్లోనూ ప్రపంచ రికార్డులు నెలకొల్పాడు. 2026 ప్రపంచకప్‌లో ఆరు వేర్వేరు టోర్నీల్లో గోల్స్ చేసిన తొలి ఆటగాడిగా మరో ఘనత సాధించాడు. యూరో కప్ చరిత్రలో అత్యధికంగా 14 గోల్స్, 30 మ్యాచ్‌లు ఆడిన రికార్డులు కూడా అతడి పేరిటే ఉన్నాయి.

పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించిన భారత్.. షేక్‌హ్యాండ్ ఇచ్చి కూల్ చేసిన ఇండియన్ ప్లేయర్స్



బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని నేషనల్ స్టేడియం వేదికగా (గురువారం, నవంబర్ 5, 2026) జరిగిన శాఫ్ ఛాంపియన్ షిప్ 2026 గ్రూప్-బి ప్రారంభ పోరులో భారత ఫుట్‌బాల్ జట్టు 3--2 గోల్స్ తేడాతో పాకిస్తాన్‌పై అదరిపోయే విక్టరీ సాధించింది. దాయాదిపై గెలుపుతో గ్రూప్-బి పాయింట్ల పట్టికలో ఇండియా టాప్‌లోకి దూసుకెళ్లగా.. మ్యాచ్ ముగిసిన తర్వాత ఇరు జట్ల ఆటగాళ్లు కరచాలనం చేసుకోవడం హాట్ టాపిక్ గా మారింది.

ఫస్ట్ హాఫ్‌లో సుహైల్ భట్ ఊచకోత:

మ్యాచ్ ప్రారంభం నుంచే పాకిస్తాన్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా వరుస గోల్స్‌తో విరుచుకుపడింది. ముఖ్యంగా సుహైల్ అహ్మద్ భట్ మ్యాచ్ ప్రారంభమైన 14వ నిమిషంలో తొలి గోల్, 20వ నిమిషంలో రెండో గోల్ సాధించి భారత్‌కు 2--0 లీడ్ దక్కేలా చేశాడు. ఇక 32వ నిమిషంలో మంగ్లెన్‌థాంగ్ కిప్జెన్ మూడో గోల్ సాధించి పాక్ డిఫెన్స్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. దీంతో పాక్ కు లభించిన పెనాల్టీ చాన్స్ నాన్-కన్వర్ట్ కావడంతో (షాయక్ దోస్త్ మిస్ చేశాడు) టీమిండియా ఫస్ట్ హాఫ్ ని 3--0 లీడ్‌తో ముగించింది.

సెకండ్ హాఫ్‌లో పాక్ కమ్‌బ్యాక్ డ్రామా:

సెకండ్ హాఫ్‌లో పుంజుకున్న పాకిస్తాన్ మ్యాచ్ ముగిసే సమయంలో భారత్ పై తీవ్ర ఒత్తిడి పెట్టింది. అట్యాకింగ్ పెంచిన పాక్ తరఫున నజీబ్ ఉల్లా (91వ నిమిషం), ఆలమ్‌గిర్ ఖూజీ (94వ నిమిషం) ఇంజ్యూరీ టైమ్‌లో రెండు గోల్స్ కొట్టి మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చారు. అయితే, భారత డిఫెండర్లు చివరి క్షణాల్లో అద్భుతంగా కంట్రోల్ చేసి, 3--2తో విజయాన్ని ఖాయం చేసుకున్నారు. ఈ విజయంతో గ్రూప్-బిలో భారత్ అగ్రస్థానంలో నిలవగా.. తమ నెక్స్ట్ మ్యాచ్‌లో బుధవారం (నవంబర్ 11న) మాల్దీవులతో ఇండియా తలపడనుంది.

ఆర్సీబీ రిటెన్షన్ లిస్ట్ 2027: కోహ్లీ, పాటీదార్ సేఫ్.. ఛాంపియన్ టీమ్ నుంచి 6 స్టార్స్‌పై వేటు?



ఐపీఎల్ 2027 మిని వేలానికి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ తమ జట్టు వ్యూహాలపై స్పష్టమైన ప్లాన్‌తో ముందుకు వెళ్తోంది. టైటిల్ విన్నింగ్ కోర్‌ను కాపాడుకుంటూనే, జట్టు బ్యాలెన్స్ కోసం కొందరు ఆటగాళ్లను రిలీజ్ చేసేందుకు యాజమాన్యం సిద్ధమైంది. విరాట్ కోహ్లీ, కెప్టెన్ రజత్ పటిదార్‌లతో పాటు ప్రధాన బౌలర్లను రిటైన్ చేసుకోనున్న ఆర్సీబీ.. రొమారియో షెఫెర్డ్, నువాన్ తుషార లాంటి కీలక ఆటగాళ్లకు గుడ్‌బై చెప్పే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఆర్సీబీ రిటైన్ చేసుకునే ఆటగాళ్లు :

ఆర్సీబీ జట్టు నిలకడను దెబ్బతీయకుండా ఉండేందుకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ ప్రధాన ఆటగాళ్లను కొనసాగించనుంది.

బ్యాటింగ్ విభాగం: రికార్డుల వీరుడు విరాట్ కోహ్లీ, కెప్టెన్ రజత్ పాటిదార్, దేవదత్ పడిక్కల్, ఫిలిప్ సాల్ట్, టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, జోర్డాన్ కాక్స్.

ఆల్‌రౌండర్లు: కృనాల్ పాండ్యా, వెంకటేష్ అయ్యర్, జాకబ్ బెథెల్.

బౌలింగ్ విభాగం: జేమ్స్ హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్, రసిఖ్ దార్ సలామ్, సుయాష్ శర్మ, స్వప్నిల్ సింగ్, జాకబ్ డఫీ.

యంగ్ టాలెంట్: వికీ ఓస్త్వాల్, సాత్విక్ దేశ్‌వాల్, కనిష్క్ చౌహాన్, విహాన్ మల్హోత్రా.

బెంగళూరు వదిలేయబోతున్న ప్లేయర్లు

ఐపీఎల్ మిని వేలంలో కొత్త బౌలింగ్ ఆప్షన్ల కోసం పర్స్ బ్యాలెన్స్ పెంచుకోవడానికి ఆర్సీబీ కొందరిపై వేటు వేయబోతుంది.

రొమారియో షెఫెర్డ్, నువాన్ తుషార: విదేశీ కోటా సర్దుబాటులో భాగంగా వీరిద్దరినీ రిలీజ్ చేయనున్నారు.

యష్ దయాళ్: ఫిట్‌నెస్, లభ్యత ఆధారంగా యష్ దయాళ్‌ను వదిలేసే ఛాన్స్ ఉంది.

మంగేష్ యాదవ్: రూ. 5.20 కోట్లకు కొనుగోలు చేసినప్పటికీ, వేరొక వేరియేషన్ బౌలర్ కోసం ఇతడిని రిలీజ్ చేయవచ్చు.

ఇతర ఆటగాళ్లు: రిచర్డ్ గ్లీసన్, అభినందన్ సింగ్.

షెఫెర్డ్, దయాళ్, తుషారలను విడుదల చేయడం ద్వారా ఆర్సీబీ సుమారు రూ. 8.10 కోట్ల పర్స్ బ్యాలెన్స్‌ని మరింత పెంచుకోనుంది.



చిరంజీవి, బాలయ్య, వెంకటేష్, నాగార్జున కాంబోలో మూవీ రాబోతోందా?





గత కొన్ని సంవత్సరాల నుంచి వీళ్ళ నలుగురిని కలిపి సినిమా చేయడానికి చాలామంది దర్శకులు ప్రొడ్యూసర్లు ఆసక్తి చూపిస్తున్నప్పటికి అది కార్యరూపం దాల్చడం లేదు.

గత 4 దశాబ్దాలుగా తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తమకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకొని, తరాలు మారుతున్న బాక్సాఫీస్ వద్ద తిరుగులేని స్టార్లుగా వెలుగొందుతున్న నలుగురు దిగ్గజాలు చిరంజీవి,బాలయ్య, వెంకటేష్, నాగార్జున. ఇతర భాషల నుంచి ఎదురయ్యే పోటీని తట్టుకుని తెలుగు సినిమా ఇండస్ట్రీని ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర వహించారు. సీనియర్ హీరోలుగా గుర్తింపును సంపాదించుకున్న ఈ నలుగురు హీరోలు ఇండస్ట్రీలో ఉన్న స్టార్ హీరోలతో పోటీ పడుతున్నారు. ఇప్పటికీ వాళ్ల నుంచి వచ్చే సినిమాలు ఇండస్ట్రీ రికార్డులను బ్రేక్ చేయగలుగుతున్నాయి.

ిటర్లకి సవాలుగా మారిందా

త కొన్ని సంవత్సరాల నుంచి వీళ్ళ నలుగురిని కలిపి నిమా చేయడానికి చాలామంది దర్శకులు ప్రొడ్యూసర్లు సక్తి చూపిస్తున్నప్పటికి అది కార్యరూపం దాల్చడం లేదు. రణం ఏంటంటే ఈ నలుగురు ఇమేజ్ ను బ్యాలెన్స్ స్తూ ఒక కథని రాయడం అనేది అసాధ్యం. ఒకరి ్యారెక్టర్ కి ఇంపార్టెన్స్ పెరిగితే మరొకరి కి ప్రాధాన్యత గ్గిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి ఆ థను హ్యాండిల్ చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని ఇప్పటికే చాలామంది రైటర్లు ప్రయత్నించి వదిలేసారు...

ఈ నలుగురిని కలిపే దర్శకులు ఉన్నారా?

ప్రస్తుతం ఇండస్ట్రీలో ఈ నలుగురితో సపరేట్ గా సినిమాలను చేస్తున్న దర్శకులు ఉన్నారు. కానీ వీళ్ళను కలిపి సినిమాలను చేయగలిగే దర్శకులు ఎవరున్నారు అనే దోరణిలో కొన్ని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలుగు సినిమా ఇండస్ట్రీలో రాజమౌళికి ఈ నలుగురిని హ్యాండిల్ చేసే కెపాసిటి ఉంది. కానీ ప్రస్తుతం ఆయన వరల్డ్ సినిమా స్థాయికి వెళ్తున్నాడు. కాబట్టి ఈ నలుగురితో సినిమా చేయడం కష్టమనే చెప్పాలి.

ఇక తమిళ్ సినిమా ఇండస్ట్రీ విషయానికి వస్తే రీసెంట్ గా 'జైలర్ 2' సినిమాతో సూపర్ సక్సెస్ ని సాధించిన నెల్సన్ కి సైతం ఈ నలుగురి ఇమేజ్ ను హ్యాండిల్ చేస్తూ సక్సెస్ ని సాధించగలిగే కెపాసిటి ఉంది. కానీ దానికి తగ్గట్టు కథ దొరకాలి. అలాంటి కథని కనుక రాసుకోగలిగితే మాత్రం నెల్సన్ ప్రతి ఒక్కరి ఇమేజ్ కి తగ్గట్టుగా వాళ్ళను డిఫరెంట్ స్టైల్ లో చూపించే ప్రయత్నం చేస్తాడు. జైలర్ 2 రజనీకాంత్ ను డిఫరెంట్ గా ప్రజెంట్ చేస్తూ, భారీ లెవెల్లో ఎలివేట్ చేస్తూ ప్రతి ఒక్కరిని మంత్రముగ్ధుల్ని చేశాడు...

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965